


విశ్వంభరి
- శ్రీలత

అనివార్యమైన భావాల ఉప్పెన

# విశ్వంభరి

– శ్రీలత

SIRI - SRUTHI PUBLICATIONS

# విశ్వంభరి

Poetry by SRILATHA

© with the Writer

ప్రచురణ : మార్చి, 2001

ప్రతులు : 1000

మూల్యం : రూ.30/-

ప్రతులకు :

శ్రీ ఎం. కొండయ్య, ఎం.ఎస్.సి.,
ప్రవర్ధన్ సీడ్స్ ప్రై. లి.,
భూత్‌పూర్, మహబూబ్‌నగర్ జిల్లా - 509 382.
ఫోన్ : 08542-36204, 36205, 36231.
ఆఫీస్ :
8-11, లాల్‌బహదూర్ స్టేడియం, హైదరాబాద్ - 500 001.
ఫోన్ : 040-3237917, 3233397

2. విశాలాంధ్ర ప్రచురణలు అన్ని శాఖలు
3. నవోదయ బుక్ హౌస్, కాచిగూడ, హైదరాబాద్.
4. దిశ పుస్తక కేంద్రం, చిక్కడపల్లి, హైదరాబాద్.
5. ప్రగతి బుక్ హౌస్, విజయవాడ
6. నవోదయ బుక్‌స్టాల్, గుంటూరు.

ముఖచిత్రం : లక్ష్మణ్ ఏలే

లోపలి బొమ్మలు : కె.ఎస్. భాస్కర్

ఫోటోటైప్ సెట్టింగ్ :
శివదత్తా గ్రాఫిక్స్, హైదరాబాద్,
ఫోన్ : 375 6406

ముద్రణ :
దీప్తి ప్రింటర్స్, లకిడికపూల్,
హైదరాబాద్ - 500 004.
ఫోన్ : 3310321

## స్ఫూర్తి

అనుభవాలు కోకొల్లలు
అఘోరిస్తున్నానే తప్ప
కవిగ నేనేదో గొప్పగ
కవిత్వీకరిస్తున్నానని చెప్ప!

కోరను నేను పొగడ్తలను
కోరను ఏ బహుమతులను
అర్థహీనాలన్నా నా కవితలు
అంతగ పట్టించుకోను

– గాలిబ్
(మీర్జా అసదుల్లా బేగ్)

# ముందు ఓ మాట

నాదొక నూతన వేదం
నేనొక సరికొత్త నాదం
ప్రకృతి పరవశ పదనర్తనం
ప్రళయ ప్రణయ మిళిత ప్రకాశిత నినాదం
విశ్వ హృదయ సమైఖ్య భావనా పరివేష్టితం
తుదిని కూర్చిన మనోన్మధనం

ఆది కణం అమీబా ద్వికణం అవ్వడమే స్త్రీత్వం. నిశబ్దపు విశ్వంలో మౌనం చీలిన తొలికణం విశ్వంభరి. ఇది స్త్రీ కావ్యం. అందుకే ఆదితత్వాన్ని విశ్వంభరిగా భావించాను. అది స్త్రీత్వమని విశ్వంలోని నిశ్శబ్ద నిజాన్ని శోధించి చూపించాను. స్త్రీత్వం అబల సబల అన్నీ తనే. తనలోంచే పూలూ, ముళ్ళూ, తనలోంచే జాతులు జీవులు. ఇక స్త్రీత్వంలో బేధం ఏముంది? స్త్రీత్వంపైన విశ్వంలో ఆధిపత్యం ఏముంది తానే విశ్వం అయినపుడు? ఇది స్త్రీ గా ఉండాల్సిన అమోఘ భావన. ఈ భావన స్త్రీకి తనలో ఉన్న విశ్వాన్ని సందర్శింపజేస్తుంది. నేను నాలో విశ్వాన్ని చూసుకున్నాను. అది ప్రపంచానికి చూపించాలనే ఉద్దేశంతో చిన్నిచిన్ని మాటలతో, పోలికలతో, సంఘటనలతో ప్రయత్నించాను. దీనిని కవిత్వం అనను. సాహిత్యం అనను. భావత్వం అంటాను. ఆ భావత్వం నుండి ఒక విషయాన్ని కవితాప్రియులు దర్శించి తీరగలరు సహృదయులైతే అని కూడా అంటాను. అది దర్శించిన తర్వాత విశ్వమైన స్త్రీకి అందులో అణుమాత్రమైన తాను,

అంకితమై ఉన్నానని తెలుసుకోవడం పురుషునికి మరింత తేలిక. విశ్వమైన తాను పురుషుని సృజించి ధరించానని భావించడం స్త్రీకి చేలాంచల మాత్రం. స్త్రీ పురుషులిద్దరిలోనూ ఈ ఆలోచన విశ్వంలోని ఇంద్రధనుస్సంత అందమైనదీ, అద్భుతమైనదీ కావాలనేదే నా తపన.

ఇక సినారె గారికి అంకితం ఎందుకిస్తున్నానంటే ... విశ్వంభరిలో మనిషి ఆహ్వానం గురించి, ప్రకృతిని జయించిన నాగరికతా పరిణామం గురించి చాలా అద్భుతంగా తెలిపిన శ్రీ సి.నా.రె. గారు స్త్రీ గురించి ప్రత్యేక ప్రసక్తి తీసుకు రాకపోవడమనేది నా అదృష్టంగా భావించి, ఆ అవకాశాన్ని నేను తీసుకున్నాను. కనుక 'విశ్వంభరి' కి 'విశ్వంభర' కర్త అయిన సినారె గారు అంకితం తీసుకోగలిగిన అర్హత గల వారిగా భావించాను. ఈ నిర్ణయానికి ఆయన అద్భుతగలరని భావిస్తూ సరస్వతీ ముద్దుబిడ్డ, విశ్వంభర పితామహులు, జ్ఞానపీఠాధికారంతో తిరుగులేని రచనా రారాజు అయిన శ్రీ సి.నా.రె. గారికి సగర్వంగా అంకితమిస్తున్నాను.

- **శ్రీలత,** ఎం.ఎ.ఎల్.ఎల్.బి.,


సరస్వతీ పుత్రుడు

విశ్వంభర ప్రియుడు

సాహితీ సమ్రాట్

శ్రీ సి. నారాయణరెడ్డి గారికి

**అంకితం**



జ్ఞానపీఠ అవార్డు గ్రహీత
**డాక్టర్ సి.నారాయణరెడ్డి**, ఎం.పి.
ఎం.ఏ.పి.హెచ్.డి.డి.లిట్.

అధ్యక్షులు
**ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర సాంస్కృతిక మండలి**
ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం
కళాభవన్, హైదరాబాద్ - 500 004
ఫోన్ (ఆ) 040-3214603 (ఇ) 3548451
ఫ్యాక్స్ : 3214603

తేది : 7.3.2001

# ఆమోదం

స్త్రీ శక్తి పారమ్యం శ్రీలత నిర్దేశించుకున్న చరమగమ్యం. ఆ దిశలోనే రచయిత్రి చేస్తున్న ప్రస్థానానికి నిదర్శనం ఈ 'విశ్వంభరి' కవితా సంపుటి. శ్రీలతలో నిశిత భావుకత వుంది. అభివ్యక్తి గాఢత ఉంది. ఈ రెండూ ఉన్నప్పుడు పదునైన కవితలు వెలువడక ఏంచేస్తాయి?

వస్తువులో, భావ ప్రకటనలో గణనీయ వైవిధ్యమున్న ఈ 'విశ్వంభరి'ని 'విశ్వంభర' కర్త అయిన నాకు అంకితం చేయాలని సంకల్పించుకుంది శ్రీలత. ఆ ఔచిత్యాన్ని అవగతం చేసుకున్న నేను నా ఆమోదం తెలిపాను. ఇక కావలసింది సహృదయ పాఠకుల అభిస్పందన.

**(డా॥ సి. నారాయణరెడ్డి)**

ప్రొ॥ ఎస్. గోపి.
ఎం.ఏ.పి.హెచ్.డి.,
వైస్ ఛాన్సలర్
పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం
లలిత కళాక్షేత్రం, పబ్లిక్ గార్డెన్స్,
హైదరాబాద్ - 500 004
ఫోన్ (ఆ) 040-3234815
(ఇ) 040-7037585
ఫ్యాక్స్ : 3236045

తేది: 10.3.2001

# విశ్వంభరి - కవితాఝరి

'అర్థహీనాలు' అనను కానీ అర్థవంతం వైపు ప్రయాణిస్తున్న కవితలివి. కవితా సంపుటే కానీ నిర్మాణ దృష్టి వుంటే దీర్ఘకావ్యమయ్యేది. ఇంతకుముందే శ్రీలత నాలుగు పుస్తకాలు ప్రచురించింది. కథలు, నవలిక, శతకం, కవితా సంపుటి. నవలికకు 'స్వాతి' నిర్వహించిన పోటీలో గుర్తింపును పొందింది. 'ధిక్కారం' పేరుతో వచన కవితా సంపుటిని ప్రచురించింది. ఇప్పుడీ ప్రచురణతో మరింత విశాలమైన ఆవరణలోకి అడుగుపెట్టింది.

'విశ్వంభరి' గ్రంథం పేరు. వెంటనే సినారె 'విశ్వంభర' గుర్తుకొస్తుంది. ఈ కవయిత్రికీ ఆ స్పృహ వుంది. అందుకే ఔచితీమంతమైన అంకితం. విశ్వంభరలో స్త్రీని గురించిన ప్రత్యేక ప్రసక్తి లేకపోవడం ఆసరాగా తీసుకుని స్త్రీ దృక్కోణంతో ఈ కవితలు రాసింది. 'మనిషి'లో స్త్రీ పురుషులిద్దరూ ఉన్నప్పటికీ ప్రత్యేకంగా స్త్రీత్వ దృక్పథంతో విశ్వంభరిని రూపొందించింది శ్రీలత. ప్రకృతి, పురుషుల్లో ప్రకృతి మాట్లాడుతుందీ కావ్యంలో ....

''నాలోంచే చెట్లు మొలుస్తున్నాయి
..........................................
పుడమి ప్రదక్షిస్తూ ప్రణమిల్లుతూంది''

ఈమె భావాలన్నీ ప్రాక్తన నూతనంగా వున్నాయి. ఇప్పటి అర్థంలో స్త్రీవాదం కాదు. మౌలికాంశాలు మన్నిస్తూనే ఆధునికంగా ఆలోచించే మహిళ ఈ కవితల్లో కన్పిస్తుంది.

శ్రీలత భావాలన్నీ లలిత లలితాలు, కవితాత్మకాలు, భావుకతాభరితాలు. కొండొకచో తాత్త్వికస్పర్శావిలసితాలు.

స్త్రీత్వమంటే మాతృత్వమే. బాహ్య సూత్రాలన్నీ నిమిత్తమాత్రాలు. అసలు సూత్రం స్త్రీయే. స్త్రీత్వంలోని అన్ని పార్శ్వాలనూ ఆమె పట్టుకుంది.

''జీవన నాటక రచనా కర్తలం మేం
అనంతాది శక్తి స్వరూపుణులం మేం
ధరణిపై అగ్ర దేవస్థాన అమ్మలం మేం''

అంటుంది.

స్త్రీ మాతృమూర్తే కాదు ప్రేమమూర్తి కూడా. ప్రేమ వల్ల ఆమె బంధనాలను వ్యతిరేకించదు. సంతానం ఆమెకు బంధనం అయినా అది ఆమెకు ఇష్టమైన బంధనం.

తల్లి పార్శ్వాన్ని చూపినప్పుడు ఆర్ద్రంగా చిత్రించిన కవయిత్రి ప్రేమ కోణాన్ని ప్రదర్శించినప్పుడు భావకవిగా విజృంభించింది. 'ఎందులకో' కవిత కృష్ణశాస్త్రిని గుర్తు చేస్తుంది.

సున్నితమైన భావాలు, మృదువైన శైలి, హత్తుకుపోయే వ్యక్తీకరణ శ్రీలత సొత్తు. ఈ కవితలు హాయిగా చదివిస్తాయి. శ్రీలతను అభినందిస్తున్నాను.

— గోపి

(ప్రొ॥ ఎన్. గోపి)

# ఇదీ వరస


| | | |
|---|---|---|
| 1. | విశ్వంభరి | 13 |
| 2. | నంబూద్రి ఇల్లం | 18 |
| 3. | నీకోసం | 20 |
| 4. | స్త్రీత్వం | 21 |
| 5. | సూత్రం | 24 |
| 6. | నన్ను నూతనంగా నిర్మించు | 26 |
| 7. | మేము... | 27 |
| 8. | ఎందులకో | 29 |
| 9. | ఉషస్సు | 30 |
| 10. | చినుకు | 32 |
| 11. | సంజీవిని | 34 |
| 12. | పదాలకు అందని... | 36 |
| 13. | నస్త్రీ బంధ విముక్తాభిలాషి | 37 |
| 14. | ఝురి | 40 |
| 15. | నన్ను నన్నుగా వెలగనీ | 42 |
| 16. | ముసిముసి నవ్వుల పూత | 44 |

| | | |
|---|---|---|
| 17. | జీవదాత | 46 |
| 18. | మమేకం | 49 |
| 19. | నిజం | 50 |
| 20. | స్థాపితం | 52 |
| 21. | జిజ్ఞాస | 55 |
| 22. | నాణేనికి మరోవైపు | 57 |
| 23. | పనిపిల్ల | 59 |
| 24. | చిత్రం | 61 |
| 25. | నీకే నీకే | 63 |
| 26. | అమ్మ కొమ్మ | 64 |
| 27. | జ్ఞాపిక | 65 |
| 28. | కాలప్రకృతి గతి | 66 |
| 29. | ఏం చేస్తావు పాపం! | 68 |
| 30. | ఏం చెప్పను? | 69 |
| 31. | దర్జా దోపిడీ | 70 |
| 32. | మోడుతనం | 71 |
| 33. | నిస్సత్తువనైనప్పుడు | 72 |
| 34. | నా–నీ సంగమం | 73 |

| | | |
|---|---|---|
| 35. | జీలకర్ర + బెల్లం | 75 |
| 36. | ఆదారి...! | 77 |
| 37. | అదృశ్య మౌనం | 80 |
| 38. | అడ్డం | 82 |
| 39. | తప్పుకోండి... తప్పుకోండి! | 85 |
| 40. | మీకు తెలుసా? | 87 |
| 41. | ప్రకృతి | 89 |
| 42. | అందాక | 91 |
| 43. | అర్పణ | 92 |
| 44. | జాడలు దొరకని నీడ | 95 |
| 45. | బలిపీఠం | 98 |
| 46. | నీకేం? | 101 |

# విశ్వంభరి

ముగ్గులకు చుక్కలు పెడుతూ
లలనని అబలని సుకుమారిని
సుమాన్ని సుందరాన్ని కోమలిని
రమణిని మువ్వల చిరు రవళిని
అని నాలో నేను తలవంచుకుని
తలపులలో మునిగిన ఘడియలవి!

ఏదో శక్తి చివుక్కున జడ మొదళ్ళు పట్టి
మెడ ఎత్తి పట్టి చెంప మీద ఛెళ్ళుమంది
అప్రయత్నంగా ఆర్తంగా నా నోరు
బ్రహ్మాండంగా విచ్చుకుంది
నా కనుగుడ్లు విడిపోయి
నాకెదురుగా నిలబడ్డాయి.

నా శరీరానికేవీ కనిపించడం లేదు
శూన్యంలో అయోమయం తప్ప
నా కళ్ళు మాత్రం విస్ఫుల్లింగాలై
నన్ను లోలోతుల్లోకి చూస్తున్నాయి

మంటలు మంటలు నాలోపల్నుంచి
భగభగలాడే అగ్ని కణికలు
వాటి మీద పొంగుతూ సుళ్ళు తిరుగుతూ

ఎగిసెగసి పడుతున్న నీటి అలలు
తరులూ గిరులూ ఝురులూ
తేడా లేకుండా కలిపి మెలిపెడుతున్న హోరుగాలి
దద్దరిల్లుతూ నాకు నన్నే వినిపించనీయని
కొన్ని కోట్లు కలిసి మ్రోగుతున్న ఢమరుక నాదాలు

నాలోంచే చెట్లు మొలుచుకొస్తున్నాయి
మేఘాలు కలిసి సాగుతున్నాయి
మెరుపులు తీగలల్లుతున్నాయి
పూలు పసిరేకులతో నవ్వుతున్నాయి
పుడమి ప్రదక్షిస్తూ ప్రణమిల్లుతూంది.

గ్రహాలు వెలుగుతూ భ్రమిస్తున్నాయి
తోకచుక్కలు అక్షింతల్లా రాలుతున్నాయి
నా గర్భం పెరిగీ పెరిగీ జీవులన్నింటినీ
ఇముడ్చుకున్న పుష్పక విమానమయింది
పాల పుంతలు కొన్ని కోట్లు కదిలిపోతున్నాయి
శూన్యంలో వెలుతురు! కాంతినంటి చీకటి
నిశ్శబ్దాన్ని ఛేదిస్తూ ఢమరుకం
ఢమరుకాన్ని శాసిస్తూ జడత్వం!

తరులను విరబోసుకుని
గిరులను ఎదపై మోసుకుని
ఇసుక మేటలు వెన్నంటి వస్తుంటే
కాలపు వెన్నెముక కొండచిలువలా పాకుతూంది

ప్రకృతంతా కలిసి దేనికో పోతపోస్తున్నాయి
అది అష్టభుజియై సర్వాయుధాలు ధరించి
''ఓంకారం'' చేస్తూ
పాదాలు నిలుపకుండా పరవశమై
తాండవ మాడుతూంది క్షణమైనా నిలవకుండా

అదే తోలు చర్మం కట్టుకుని
బడిసె విసిరి ఏనుగులను కూలగొడుతూంది.
బిడ్డను నడుముకు కట్టుకుని
ఊడలు పట్టుకు జారుతూంది.
ఆడ పులుల మందలలో
లేడి మాంసం పీక్కు తింటూంది
సింహాలు ఎలుగుబంట్లూ
ఖడ్గమృగాలు జలభూచరాలుగా
చుట్టుముట్టి ఎదిరించినా
హేళనగా పరిహసిస్తూ
తొణకని బెణకని విజేతయై
ఈలు పట్టుకు నిలుచుంది.

దాన్నానుకుని దానిలాంటి బక్క పలుచని ప్రాణి
కానీ ఆ ప్రాణికి క్షీర నిలయాలు లేవు
ఆ ప్రాణి ఏ కూననూ ఇవ్వలేదు
ఏ మందనూ పెంచలేదు
ముకుళితమై ఆశ్రయించిన ప్రాణది
పులి ఘర్షణకు ఉలిక్కిపడి

ఈటె పట్టుకు లేచిందా శక్తి!
వీపు మీద కూన కెవ్వుమంది
పక్కనున్న బిడ్డ బావురుమంది
కడుపులోని పిండం గడబిడ పడింది
అడుగు బరువయింది! సింహం చేరువయింది
ఆదిశక్తి అటూ ఇటూ చూసింది
బక్క పలుచని వెన్నెముకను బలంగా నిమిరింది
చివ్వున నిటారై నిలబడిందా ప్రాణి
చేతిలోని ఈటె చేతికందించి
గురి చూపించి విసిరికొట్టమంది
కూలిన మృగం చుట్టూ ఆనందంతో
ఆ ప్రాణి ఆగని గంతులు
ఈటె పట్టుకు గెలిచిన విజయమై
అదేపనిగా ఆ ప్రాణి పరుగులు

కడుపు చీల్చుకు బిడ్డ జారింది
ఖడ్గ మృగంపై ఈటె వాలింది
కాలిన మాంసంతో ఆ ప్రాణి
నేర్పిన సూటికి, ఆకలి నోటికి
అర్పించిన తొలి నైవేద్యం!
అతడే పురుషుడైనాడు
ఆ శక్తే నీడలో నిలిచింది
చూపుడు వేలు సారించి
గెలుచుకు రమ్మన్న ప్రతిదీ
తెచ్చి తన పాదాక్రాంతం చేస్తుంటే

జగజ్జేతయై వెలిగింది!
విశ్వంభరియై నిలిచింది!
రాజ్యాలు భోజ్యాలు రారాజులు రణధీరులు
తన ఆజ్ఞకు తలవంచుతూ
రత్నాలు వజ్రాల అభిషేకాలు
మహల్‌లూ మందిరాల నిర్మాణాలు
తన ప్రసన్నానికి కేటాయిస్తుంటే
సంస్కృతులూ సంస్కారాలు పెంచుతూ
తిరుగులేని అంతఃశక్తిగా స్థాపించుకుని
స్థిరమయిందా శక్తియుక్తి రణధీయుక్తి!

అది ఒక అంతర్లోకం!
అది ఒక అబహిర్గతం
అది ఒక అనంత విన్యాసం
అది ఒక అనుభవేకవేద్యం
అది ఒక విప్పలేని ప్రకృతి రహస్యం
అది నేనే, చూస్తున్నవీ నా కళ్ళే
ఆశ్చర్యంతో అనర్గళంలో ఆవిష్కరణలో
పేలిపోతాయనుకున్నాయేమొ
చటుక్కుని వచ్చి శరీరానికి అతుక్కున్నాయి
అంతా మౌనం! విశ్వదర్శనం తరువాతి నిశ్శబ్దం.

అది నేనే! అదే చోటు! అవే పరిసరాలు
కానీ ముగ్గులకు చుక్కలు కాదు
చుక్కలతో ముగ్గులు పెడుతున్నా!



# నంబూద్రి ఇల్లం

అది ఊడలు దిగిన తాళం

అక్కడ ఎన్నో రెక్కల జీవులు

ఉష్ అంటే ఎగిరిపోయే చంచలనాలు

ఆకలికై ఆర్తికై ఆనందానికై

నీడకై గూడుకై కూడుకై తోడుకై

గుంపులు గుంపులుగా తెంపరి తెంపరిగా
వస్తూనె జతకడ్తూనె కువకువలు రేపుతూనే
ఆ కొమ్మలు ప్రసవిస్తాయి ఆ రెమ్మలు పల్లవిస్తాయి
ఆ కూనలకు రెక్కలు రాగానే ఎగిరిపోతాయి
మళ్ళీ గూళ్ళు మళ్ళీ తోళ్ళు మళ్ళీ వలసలు
ఆ తాళం మాత్రం విస్తరిస్తూనే
శాఖలు శాఖలుగా ఊడలు ఊడలుగా
అంతరాలుగా అంతరాంతరాలుగా
ప్రపంచమంతా పరిపక్వంగా
రానీ తిననీ ఉండనీ పోనీ

నేను పోను రాను! కానీ ఉండిపోతాను!
అని చిగురాకులు గాలితో
రహస్యంగా గానం చేస్తున్నాయి
తెలిసిన విషయానికి తాళాలెందుకని
ప్రకృతి మౌనంగా మందలిస్తోంది
గుంపులుగా సాగుతున్న రెక్కల జీవుల
తమకానికి తాళం నవ్వుకుంటున్నది
అది ''నంబూద్రి ఇల్లం'' అని
భూగోళం పవిత్రంగా నిర్వచిస్తున్నది
అది ''రాబోయే కాలమని''
చరిత్ర అపురూపంగా సవరిస్తున్నది

# నీకోసం

నిన్ను చూడాలని
తూర్పు పడమరలూ
ఉత్తర దక్షిణాలు కలిపేసి
నిముషం తీరిక లేకుండా
కలగాపులగంగా వెతుకుతుంటా
కనిపించనీయకండని దిక్కులను కోరుకుంటా!

నీ స్వరం విందామని
వనమంతా విచ్చలవిడిగా తిరుగుతూ
నీ పేరు కోయిలగా కూస్తూనే వుంటా
నీవు ప్రతి పలకకూడదని వాసంతిని వేడుకుంటా!

ప్రతి క్షణం నా ఊహలో నా భావనలో
ఆలోచనలో ఆవేదనలో ఆవేశంలో
నిన్నే నిలుపుకుని పలవరిస్తుంటా
నీ తలపుల్లోకి నేను మాత్రం రాకూడదని
నీ గుండెకు గడియవేసి తప్పుకుంటా!

నా ఉనికి ముందు నీ కర్తవ్యం బలహీనమవుతుందని
నా అర్పణకు నీ జన్మను ధారపోసుకుంటావని
నాకు ప్రసాదంగా నిన్ను అర్పించుకుని
నా లయలో నీ అస్థిత్వం కోల్పోతావని!

# స్త్రీత్వం

అవిస్తారంగా అమాన్యంగా
అచంచలంగా అభ్రమరంగా
అముకుళించి వ్యాకులించి
నిర్లేతం నిర్దేశం
నిర్దిష్టం నివేదితమై
నేను పవళించిన వేళ
పాదాల చుట్టూ పారాడుతూ
చనుకట్టు దిగిన చంటాడిలా
అమాయకత్వం అలుముకుని
ఉంగా ఉంగామని అడుగుతావు
నేనెవ్వరని?
వంటి కంటిన దుమ్ము దులిపి
నుదుటి నులిమిన చెమట చిదిమి
చెదరిన ముంగురులు సర్ది
అడుగులకు అరచేతులు మోపి
ఎదదాక ఎత్తిలేపి
బిగి బాహువుల మధ్య
జారిపోకుండా కూలిపోకుండా
అదిమిపట్టి బిగువుచుట్టి
చూపుడు వేలు సారించి
అల్లదిగో చంద్రమంటాను
అంబరమంటాను మేఘుడంటాను

ఉరుమంటాను పిడుగంటాను
తొలకరంటాను తుమ్మెదంటాను
తూలిపోకంటాను తుళ్ళిపడకంటాను
మెత్తనైన వెన్నెముక సవరించి
వీరుడంటాను శూరుడంటాను
నేననుకున్నవన్నీ జీర్ణించుకుని
సంతోషపడి బ్రతికేస్తుంటే
చల్లగా నవ్వుకుంటాను
మెల్లగా తప్పుకుంటాను!
తప్పటడుగులు నేర్చిన పిల్లాడు
చెడుగుడాట నేర్చేసుకుని
నిదురిస్తున్న ప్రశాంతి లాంటి నా పైకే
అరికాళ్ళతో రాతి బండలతో
అతి బలంగా కొడుతూ ఆడుకుంటూంటే
పర్వాకైన నేను చిరాకు పడి
అల్లరి చాలని కొసవేళ్ళతో
గరుకు చెంపలపై కరుకు ముద్దరలేస్తాను
నా నును తాకిడికే కేరింతలాడే నువ్వు
జిగేల్మనే జీవితం దెబ్బకు
ఉలిక్కిపడి సొమ్మసిల్లుతావు
తడబడతావు తికమకపడతావు
నిన్ను నీకు వదిలేసి
నిశ్చలమైన నిన్ను కాలివేళ్ళు కదిపి
మళ్ళీ అమాయకంగా

అడిగి తెలుసుకుంటావు
''నేనెవ్వరని''
దిక్కంటాను దృక్కంటాను
సింధూరమంటాను చిరుమువ్వంటాను
సకలమంటాను సవ్యసాచినంటాను
నువ్వు గుండె నిమురుకుంటుంటే
తల నిమురుతాను తలవాల్చుతాను
నస్థిత్వమై నువ్వు నివ్వెరపోయినపుడెల్లా
నిలబెడుతుంటాను!
అస్థిత్వమై అదిరిపడుతున్నపుడెల్లా
కూలగొడుతుంటాను!
అది వినోదం కాదు విన్యాసం
అది అవకాశం కాదు అవసరం
అది స్థాపితం కాదు చక్రభ్రమణం
అది సక్రమం! కాదు వక్రగమనం
అది సాక్షాత్ నేనే
అది లక్షణంగా నువ్వే
సాక్ష్యాసాక్ష్యాలు నీ ఉనికే
తేడా ఒక్కటే
నేనగోచరం! నీవు చరించే చంచలం!

# సూత్రం

మనిషినీ మనిషినీ మనసునీ మనసునీ
బంధించడానికి ఒక సూత్రం తప్పనిసరంటే
మరి అమ్మనూ బిడ్డనూ అక్కనూ చెల్లినీ
అన్ననూ తమ్ముణ్ణీ ప్రాణాలర్పించే స్నేహితుల్నీ
కష్టసుఖాలు పంచుకునే ఇరుగు పొరుగునీ
బంధించే మంగళసూత్రం ఏది గనుక.

థెరెస్సా ఏ సూత్రం కట్టించుకుని
ప్రపంచానికి తల్లయింది గనుక
బాపూ ఏ సూత్రం కట్టి
భారతికి తండ్రయ్యాడు గనుక
ధరిత్రికి ఏ సూత్రాలు కట్టి
సూర్యచంద్రులు సహచరులయినారు గనుక
పాలపుంత నిర్దిష్ట గమనాలకు
ఎన్ని సూత్రాలు కట్టబడ్డాయి గనుక
పాలపిట్ట ఏ సూత్రంతో గుడ్లను పెడుతుంది గనుక
సూత్రం లేని నీనాగుప్తను ఏంచెయ్యగలిగారు గనుక

సూత్రాలు నిమిత్తమాత్రాలు
మనిషి నిర్మించుకున్న మనోచిత్రాలు
తెంచేస్తే తెగిపోయే గాత్రాలు
ఎండావానను ఆపలేని చిరుగు ఛత్రాలు

మొడవంచి గుసగుసలాడే అర్థంకాని మంత్రాలు
మనసులను కాక మనుషులను కట్టేసే చిత్రాలు
సూత్రాలు వ్రతాలూ ప్రాణాలు నిలిపేవయితే
భారతదేశంలో మగాళ్ళ మరణాల రేటు పెరుగుతూందెందుకు?

జీవి జీవినీ ప్రతి ఆకర్షణనూ
కట్టిపడేసే ఏకైక విశ్వసూత్రం
నేనుగా అంతర్ధానమై
తానుగా మిగిలిపోయి
తనవారుగా మారిపోయే మమత్వం

దీనికే మంగళ వాయిద్యాలూ అక్కర్లేదు
ఏ సాక్షి సంతకాలూ చెయ్యక్కర్లేదు
మంగళం అమంగళం లేనేలేదు
సుముహూర్తం రాహుకాలమంటూ ఉండదు
అణువుకూ అణువుకూ తెలియకుండానే
ప్రకృతి కట్టిపడేసే జీవవైచిత్రం
అది తెంచడానికి కనపడదు
ధరించడానికి దారం కాదు
మనసులకు కూడా మనోగతం కాని గాత్రం
పురాతన భావనా లోలక మాత్రం
విశ్వ సృష్టికి అనాది మంత్రం.

# నన్ను నూతనంగా నిర్మించు

ప్రాణం పొయ్యడమే
పరిణామం ఇచ్చిన పవిత్ర వరం!
ఊపిరితో ఉండడమే
జీవితంతో చేస్తున్న సమరం!
జన్మ రాసిన ప్రకృతి
మరణాన్నీ రాసే పెట్టేసింది
జన్మకూ మరణానికీ మధ్య
క్షణికత్వంలో క్షమత్వమై
తొలి సంధ్యలో విరిసి మలి సంధ్యలో రాలే
పువ్వులా నవ్వులా మువ్వలా
భావాలు అనుభవాలూ
శోకాలు బంధాలూ బాధలూ
ఉద్రిక్తాలూ ఉన్మత్తాలూ
ఏవీ ఎరుగని ఏమరుపాటుగా
మౌనానందం డోలనా జీవనం
చేతనా సౌకుమార్యం, భావనా సుగంధం
ఆహ్లాద దర్శనం ఆవేదనా తీతం
ధన్య జీవనం కాదూ
క్షణమైనా చాలదూ
మనిషిలా వద్దు! పువ్వులా పుట్టించు!
ప్రకృతీ! నన్ను నూతనంగా నిర్మించు
జన్మంతా నా చేత పరిమళింపించు!



# మేము...

మేము...!

శంఖచక్రధారిణులం మేం!

ఖడ్గగధాలంకృతులం మేం!

త్రిశూలాగ్ర మెరుపులం మేం!

ధనస్సోంకారులం మేం!

చిరుత వాహనాగమనులం మేం!

ఆగ్రహోదగ్ర భావసంచలనం మేం!

దుష్టహతపాద ఘట్టనం మేం!

హృదయాంబర వలయాలం మేం!


కుంకుమ బిందు శోభితులం మేం!
మేఘ కేశాలంకృతులం మేం!
సుమదళ ధరిత పరిమళం మేం!
చంద్ర సూర్య నయనులం మేం!

శాంతి కిరణ దరహాసులం మేం!
క్షామ నిరోధిత క్షీరస్తన్యులం మేం!
కోటి జాతి ప్రాణదాతలం మేం!
క్రోధశ్శాంతినిలయ డోలనం మేం!

మేధమనో నిర్మితులం మేం!
ఆర్తనాదపు ఆదిపదం మేం!
జన్మ పారంపర్య చిహ్నులం మేం!
కుటుంబ బంధ కేంద్రులం మేం!

వయో బేధ అతారతమ్య క్షమలం మేం!
సకల బాధ్యతా బంధితులం మేం!
సక్రమ బాధ్యతాయుక్తులం మేం!
తెరచాటు తోలుబొమ్మల కేళీచతురులం మేం!

జీవన నాటక రచనా కర్తలం మేం!
అనంతాదిశక్తి స్వరూపుణులం మేం!
ధరణిపై అగ్రదేవస్థాన అమ్మలం మేం!



# ఎందులకో!

రాత్రెందుకు వస్తుందో
వెన్నెలెందుకు కాస్తుందో
పూలెందుకు పూస్తాయో
గాలెందుకు పరిమళిస్తుందో
కోయిలెందుకు కూస్తుందో
వసంతమెందుకు వస్తుందో
సెలయేరు ఎందుకు రవళిస్తుందో
నెమలెందుకు నర్తిస్తుందో
తొలకరెందుకు చినుకుతుందో
ఇంద్రధనస్సెందుకు వెల్లివిరుస్తుందో
చీకటిలో చుక్కలెందుకు మెరుస్తాయో
చిగురాకులలో చినుకులెందుకు నిలుస్తాయో
నువ్వెందుకు జ్ఞప్తికి వస్తావో
మనసెందుకు కన్నీరై తొణుకుతుందో!


# ఉషస్సు

ఏ క్షణానికాక్షణం
మరుక్షణం నువ్వొచ్చేస్తావని
గుండె గోడమీద మొండి బలపం
'రేపు'ని రాసి పెట్టేసింది.
ప్రతి ఉదయం కళ్ళు నులుపుకుంటూ
గోడవైపు చూస్తూనే ఉంటా
ఏరోజయినా రేపుని ఈరోజుగా
మార్చి తీరుతుందని!
ఆ చెరగని రేపుకెంత బలముందో
నా తరగని నమ్మకపు చూపుకంత బలముంది!
కృష్ణాష్టమి నల్లనయ్య పాదాల్లా
నువ్వు నా మనస్సులోకి వేసిన
ప్రతి అడుగూ చిరస్థాయిగా నిలిపేశా!

మనసు వ్యూహంలోకి
వెళ్ళేదారి మాత్రమే నీకు చూపించా
వచ్చేదారులన్నీ లాఘవంగా మూసేశా!
నిన్ను నేను నిర్జీవం చేయగలను
అమరుణ్ణీ చేయగలను
అవన్నీ మానేసి
నాకోసం మాత్రమే బ్రతికేసి
నా తరువాత మూగవోయేలా
మమతత్వపు సంకెళ్ళు వేసేశా!

నిన్ను నా ప్రాణపు బందీని చేశా!
ఊపిరి మరిచాకనే
నిన్ను విడుదల చేస్తా!
తరాలు మారతాయి
అంతరాలు పెరుగుతాయి
అభ్యంతరాలు లేస్తాయి
అవాంతరాలు వీస్తాయి
నన్ను నిశ్శబ్దంలోకి తోస్తాయి కానీ,
నీ అడుగులు మాపే శక్తీ, ఆయుధం
నీ దగ్గర కూడా లేదు!

అది నా హృదయ కఠోర తపస్సు!
అది తమస్సును చంపిన ఉషస్సు!
సూర్యబింబం నా కుడికన్ను
చంద్రనిలయం నా మలికన్ను
ఎంతదూరం సాగిపోగలవు
నా కిరణాలు సోకని చోటుకు!
సింధూరం నా జ్ఞాననేత్రం!
ఎక్కడున్నా ఏ దిక్కులు దాటినా
నీ దిక్కూ దృక్కూ నేనే!
నీ మనుగడ నాదృష్టి పరిధిలోనే!
అది నీ బలహీనత కాదు
అది నీ ఓటమి కాదు!
నా మనోవికాసపు అహ్లాదన
నా ఆత్మబలపు ఆకర్షణ!




## చినుకు

నేనో హిమాద్రి
ద్రవిస్తాను స్రవిస్తాను
ధరిత్రి దాహానికి ఆర్తినవుతాను
యుగాల మంచు శిలాజాలు
నిక్షిప్తం చేసి మూగవోయి
చరిత్రలు రాసుకుంటున్న
పౌరుషత్వానికి నవ్వుకుంటూ

నిజాలున్నవి నా గుండెలో
నీ కంఠంలో కానేకాదని చెప్పను

ఆవిరి ఇసుమున తైలం తీయలేను
అంబరాన్ని అంటి విశ్వాన్ని చూసిన నేను
ఆవిరై మేఘాలలో తేలి గరికవేదికపై
అరికాలు పక్కన వాలతాను
రహస్యాలనేవో చెప్పాలని
సృష్టిని బహిరంగంగా విప్పాలని!

చూపు పైకే గాని కిందకు మలపని
పాషాణ పాదాల కింద అణువులుగా చితక్కొట్టపడి
ఆర్తిగా ధరిత్రిలోకి ఇంకిపోయి
మళ్ళీ హిమాద్రినౌతాను
యుగయుగాలుగా నన్ను గుర్తిస్తే చాలు
రహస్యాలెన్నో రంగప్రవేశం చేయించగలనని
తళుకు తళుకులుగా తపిస్తూనే వున్నా
ఒక్క వేలి కొసలు కూడా నన్నెత్తి
హృదయానికి హత్తుకోలేదు
అందుకే మానవ జాతి కళ్ళున్న అంధమయింది
అజ్ఞానం వదలని విజ్ఞానమయింది.



# సంజీవిని

ఏ బాధకో కనురెప్పలు
తడిచి ముద్దవుతున్నపుడు
ఏ కారణమో గుండెను
చిదిమి రక్తసిక్తం చేస్తున్నపుడు
ఏ వేదనో గొంతును
బిగబట్టి నులిమేస్తున్నపుడు

ఏ విరక్తో మగతకమ్మి
మత్తులోకి దించుతున్నపుడు
అలవోకగా మనసు
తలుపు తడతావు
అరనవ్వుతో ఎదుట నిలుస్తావు
కన్నుల్లోకి తొంగిచూస్తూ
'నేనున్నాగా' అని సైగచేస్తావు
అదే సంజీవినిగా
చంపబోతున్న ఆఖరిక్షణాన్ని
అమాంతంగా నెట్టేసి
వడివడిగా బ్రతుకులోకొచ్చేస్తా
వాడని వసంతంలా విరియ బూస్తా
ఏ ఘడియైనా నిన్ను
నా దగ్గరకు లాక్కొస్తుందేమోనని
నేను లేనేమో అనే భావన
నిన్ను నిర్జీవం చేస్తుందని
గడియ లేని గుండె గుమ్మం ముందు
మనస్సు పుప్పొడితో
తడియారని ముగ్గుల
సంకేతపు ముద్దరలేస్తా
ఆ ఆనవాలే నా జీవన ఆహ్వానంగా
నా జీవితంలోకి నాలోకి
రాకపోతావా అని!

# పదాలకు అందని...

గాఢ సుషుప్తి ఇది
గుండె పొంగిన పరవశ ఝరి ఇది
మమతల తుషార నిధి ఇది
అనురాగ పల్లవ ప్రకంపనమిది
సుఖలోకపు ద్వార ముంగిలిది
పారవశ్యపు పదమువ్వల సవ్వడిది
మీది మీటిన వీణానాద ఒరవడిది
హృది తొణికిన మధువు పొంగు ఇది
కనులు నింపిన ఆనంద ఘడియలిది
తనువు తడిపిన అభిమాన తొలకరి జల్లిది
మౌనం బద్ధలైన మాధుర్యమిది
పెదవులు వణుకుతూ పలికిన రాగమిది
దేహం సంచలించిన సంకేతమిది
సంతోషం ఉప్పొంగిన సందడిది
సంకోచం పటాపంచలైన సంయోగమిది
ఆవేశం హద్దులు దాటిన అనుభవమిది
తనూ లతిక నాట్య ప్రకోపమిది
అణువణువూ స్రవించిన ఆనందమిది
నీ సాన్నిహిత్యంలోని లహరి ఇది
నీ సన్నిధిచ్చిన తృప్తి ఇది
భావాలకు చేరని పారవశ్యమిది
పదాలకు అందని అనుభవమిది
నీ గుండెలో నీవు నాకై కట్టిన
గుడిలోని గంటల రవళి ఇది.

# నస్త్రీ బంధ విముక్తాభిలాషి

నాకెందుకు స్వాతంత్ర్యం?
చిగురాకుల పాదాలతో
గాలిలో ఆకాశాన్ని తంతున్నపుడు
గుండెల పైకెత్తి గుసగుసలాడించి,
బరువు కాస్తా పెరగ్గానే భయపడి,
''కుంపటి బాబోయ్'' అని
ఎత్తి కుదేస్తే, తరిమేసి తలుపేస్తే
నిప్పులాంటి నేను బరువు దించి
నీకు స్వాతంత్ర్యమిచ్చి
ఇంకో ఇంటి దీపమై
నన్ను నేను బంధించుకోవద్దూ!

రూపంతో దీపం పెట్టి ఆరకుండా దోసిలిపట్టి
పసుపు కుంకుమలు పండిస్తే
అర్ధనారీశ్వరినని అన్నీ
నెత్తినేసుకుని మోస్తుంటే
ఎప్పుడూ ఇంటి చాకిరే
ఎప్పుడు మరి వంటి చాకిరని వేధిస్తే
నీ వళ్ళు దళ్ళూ కుళ్ళు చేష్టలకు
అయిష్టంగానే వదిలేసి
వయసు మనసూ గాలికి విడిచేసి
శరీరానికి స్వేచ్ఛ నిచ్చేసి

''ఉష్ కాకీ'' అని తల్లిగా బందీని కావద్దూ?
భావికి గోరుముద్దలు పెట్టి పెంచొద్దూ?


కడుపులో తన్నినా
కన్నాక తన్నినా
''కన్నా చిన్నా'' అంటూ
కాళ్ళ వెంట పడి కలికాలం ఏలేందుకు
రారాజుని చేసి మరీ
జవసత్వాలుడిగి జీవసత్వాలుడిగి
నీకు సుఖశాంతులు కల్పించి
నన్ను నేను మరచి మౌనమైపోవద్దూ!

అయినా నాకు స్వాతంత్ర్యమిచ్చే
శక్తి నీకెక్కడిది?
అదేదో నీ చేతిలోని
గాలిపటం కానేకాదు!
నా గుండెలోని అంతర్మథనం!
అయినా నన్ను విడిచి
బ్రతకలేని బంధాలే అన్నీ!

నాన్నమ్మను అమ్మమ్మను కావద్దూ
పిట్టకథలు పిల్లి కథలు అల్లద్దూ
కట్టుకథలు గుట్టు కథలు
చెట్టు పుట్టలు పట్టించొద్దూ

నేనే స్వాతంత్ర్యం పొందాలనుకుంటే
నేనే రెక్కలు కట్టుకుంటే
నీకు చిటుకులు తినిపించేదెవరు?
నేను కొమ్మను విడిస్తే
నీ గూటికి తోడెవరు?
నేను ఒడిని మరిస్తే
నీకు జోల పాడేదెవరు?
నేను యముడికి ప్రియమై ఎగిరిపోతే
నీకు కాలగమనం ఎవరు?

అందుకే అందుకే అందుకే
వద్దంటే వద్దు!
నేనే స్వాతంత్ర్యం పుచ్చుకోవాలని చూడొద్దు!
నిన్ను నాశనం చేయాలని కోరుకోవద్దు!
నేనే ఈ సృష్టి బాధ్యతల్ని నాపై వేసుకుని
శాశ్వతంగా కట్టుబడనీ!
నిన్ను ఇలా బంధాలతోనే బంధించుకుని ఉండనీ!
నిన్నెన్నెన్నో గ్రంథాలలో నాయకుడిగా నిలపనీ!
నిన్నన్నిటి కన్నా మిన్నని చేయనీ!
నువ్వు మిడిసిపడుతుంటే నవ్వుకోనీ!
నస్త్రీ స్వాతంత్ర్యమర్హతి కాదు...
''నస్త్రీ బంధ విముక్తాభిలాషి''
అని సృష్టికి కొత్తర్థం చెప్పనీ!



# ఝరి

ఎక్కడో
ఏ గీతల ఘనీభవాల మధ్యనో
సంచలన బిందువునై పుట్టి
కళ్ళున్న గుండెలపై జారిన
ఆనంద భాష్పపు వరదలా
కనురెప్పల గట్లు దాటి
ఝరినై తరంగిణినై
అంతరంగ ఉత్తుంగనై
వస్తున్నా నీ శాశ్వత సన్నిధికి
తెస్తున్నా నా మమతల పెన్నిధిని

కొండలు కోనలు ఎల్లలు ఎదలు
అడ్డెన్ని నిలుచున్నా తుళ్ళి తుళ్ళి
చీకట్లెన్ని కమ్ముతున్నా
శిఖరాలెన్ని కమ్ముతున్నా
లోయల్లోకి దూకి మళ్ళీమళ్ళీ
స్రవంతినై నిశ్చింతనై
నిమ్మళమై నివేదితమై
నీ అనంత హృదయాన లీనమవ్వాలని
అలల చేతులు సాచి
గలగలల కిలకిలల
సిద్ధాంతాల సవ్వడులు మోస్తూ
నీ బాహువుల్లో ఇమిడి
ప్రకృతినై పరిపూర్ణత తేవాలని

ఎన్నో దూరాలు దాటి
ఉద్వేగపు నురుగులు తేల్చుకుంటూ
నాలో నేనే సుడులు చుట్టుకుంటూ
అతివేగంగా వస్తున్నా
నీలో నూతన తేజం నింపి
నాలో ఉత్తేజం నీలో కలిపేసి
నిన్ను స్థిరంగా నిలబెడదామని!



# నన్ను నన్నుగా వెలగనీ

తపనం త్వరితం
లోలనం డోలనం
తొణకడం తొందరతనం
నీలాగే నాలోనూ మామూలే
ప్రకృతి పూచిన జన్మని
ఆస్వాదించడమే నీకు తెలుసు
సౌరభించడం నాకు తెలుసు

తపోతనిత గిరిని

స్థిమిత హరిత తరువుని

సంచలిత స్థాపితాన్ని

చంచలనం తెలీని స్థిరాన్నీ

తరలిపోవడమే నీకు తెలుసు

రప్పించుకోవడం నాకు తెలుసు

దేవతా స్తోత్రాలొద్దు

దాసీ నియంత్రాలు రద్దు

దీపారాధనా హారతులు వద్దు

ఛీత్కార ఉత్కారాలకు హద్దు

మధ్యస్తంలో సహజని

జాతుల్లో మనిషిని

ఆలోచనలో తరంగించనీ

ఆవేదనలో స్వప్నించనీ


ఘర్షణలో వణికించనీ

పరిష్కారంలో పల్లవించనీ

అనుభవంలో అనురాగించనీ

నన్ను నన్నుగా వెలగనీ

మరెన్నో ప్రమిదలు వెలిగించనీ!



## ముసి ముసి నవ్వుల పూత

అనంతం నుండి
చినుకు రాలుతుంది
నీ జ్ఞాపికను తెస్తూ


జీవితపు హడావిడిలో
అట్టడుగు పొరల్లో
భద్రంగా దాచిన
నీ రూపును తలపిస్తూ!

ఎక్కడున్నావు నీవు
శిశిరపు చిగురుల్లో దాగి
కనిపించక గానం చేస్తున్నావు!

గుండె అంచులకు
గులాబీ ముళ్ళు గుచ్చుతున్నావు!
తీయని బాధకు హృదయం
ఆవేదనై ఆనంద భాష్పాలుగా
చిప్పిలి చినుకుతూంది!

అదుగో ఆ దిక్కున
ఇంద్రధనస్సు వంగి
నీకూ నాకూ మధ్య
రంగులతో రాయబారం చేస్తూంది!

చాలు చాలు నీ ఊహ చాలు
నా ఊపిరున్నంత వరకు
ముసి ముసి నవ్వుల పూతలకు!



# జీవదాత

ఏ అమృత హస్తాలతో
మనోవాంఛిత శుభాశీస్సులతో
పరిపూర్ణ ప్రకాశిత శాంతితో
ఇష్టఫలసిద్ధీ మధుర పాన ప్రీతితో
ఏకాంకిత పులకింతలతో
స్థిరచిత్తమై స్థితప్రజ్ఞయై
శుభావాంఛ ఫల ఏకాగ్రమై
ఆనందోద్వేగ ప్రకంపనతో
నవనవోద్వేగ నవనీత సంచలనంతో
గమకిస్తున్న హృదయంతో
అపురూపంగా అలరిస్తూ
కొసవేళ్లు కొసరు కొసరు తాకిడికి
అనురాగం ఉప్పొంగి అలరార

నేనాదమరచి దీక్షబూని
నిను కన్నుల వెలగించుకున్నవేళ!

ఏ మోహ ముహూర్తమెంచుకుంటివో
ఏ దిక్కులను సాక్ష్యమడిగితివో
ఏ చుక్కలకు ఆతిథ్యమంపితివో
ఏ మేఘాల పందిరి చేసుకుంటివో
ఏ కోయిళ్ళను మంగళవాయిద్యాలడిగితివో
ఏ తొలకరిని అక్షింతలు కమ్మంటివో
ఏ సప్త స్వరాలను వాయిద్యం చేసితివో
ఏ మంచు గుళికలను తలంబ్రాలు చేసుకుంటివో
ఎవరికీ కనిపించని అరుదైన
అరుంధతినే ప్రమిదలో వెలగమని
అగ్నిసాక్షిగా నిలుపుకుంటివో
పంచభూతాలను పేరంటం పిలిచితివో
గాంధర్వమై గానమై గాఢమైన
సుషుప్తిలోని నాకేవీ తెలీదు!

అరవిచ్చిన రేకులు తొలుచుకుంటు
నిండిన మధువును జుర్రుకుంటు
ఇలను కలగా చేసిన మలుపులో
కాలమే మరచి కవ్వించబడ్డ నేను
నన్ను నేను వివశనై అర్పించుకోగానే
చివ్వున నాలోంచి రివ్వున వెళ్ళిపోయావు!


కొమ్మ కొమ్మను రెమ్మ రెమ్మను
రేకు రేకును ఆకు ఆకునూ
నీ ఆకృతి ఆనవాలైనా చెప్పమని
తేమ ఇంకిన గుండె పగిలేలా అరిచా
ఎక్కడున్నా తెచ్చిమ్మని అమ్మ పాదాల
కాలివేళ్ళ మీదకు జారి వేడుకున్నా
అన్నీ మౌనసాక్షుల్లా మిగిలి నిట్టూర్చాయి
అనుభవం నేర్పిన జీవితం ఆవిరయింది!

నువ్వొచ్చి వెళ్ళిన గురుతుగా
నీ కాలి పుప్పొడి జాడలు మిగిలాయి
నిర్లిప్తమయిన నేను నిర్జీవం అయ్యేముందు
నాలోని చిన్న కదలిక
చిట్టి చిట్టి పరిణామం
ప్రాణం తీసి విషపు కొమ్మవుతావో
ప్రాణం పోసి అమృతపు అమ్మవుతావో
తేల్చుకొమ్మని దైన్యంగా దోసిలి ఒగ్గింది!

అవసరపు ఆర్భాటపు అస్త్రం మాత్రమే నీవు
ప్రకృతికి పరమ పవిత్ర జీవదాత నేను
సృష్టి నిర్మాణ బాధ్యత మోస్తున్న దాన్ని
ఏ అనుభవాన్నీ నీ అంత అలుసు చేయలేను!

# మమేకం

చంద్రానికై సంద్రమై పొంగి
కిరణానికి తెగవిరియబూసి
నాగస్వరానికై నాగినిలా ఉరికి
బేలనై బెంబేలనై
పరువమై పరవశమై
నీ ఉనికి జాడలు పట్టి
ఉరికి ఉరికి చేరేది
నీ ధ్వని తరంగాలలో
తేలి తేలి వచ్చేది
నిన్నుగా మిగల్చకుండా
ఊపిరి సలుపనీయని వత్తిడిలో
నాలో కలిపేసుకుని
మమేకం చెందాలని
నువ్వంటూ విడిగా ఉండనీయని
త్వమేకం పొందాలని
నిన్ను సర్వత్రా నాకే
అంకితం చేసుకోవాలని.




# నిజం

పచ్చని మైదానాల మీద వివశమై
చల్లని తరువుల నీడలలో ఆవేశమై
మెల్లని పూరేకుల జల్లులో అర్థమై
మేం పంచుకున్నదీ నిజం
మేం పెంచుకున్నదీ నిజం
మేం కలవరించిందీ నిజం
మేం పలవరించిందీ నిజం
మేం పరవశించిందీ నిజం

గాలి పరిమళంలా
నీరూ చక్కెర కణికలా
అగ్నీ ఆజ్యపు ముక్కలా
భూమీ ధాతువు రేణువులా
శూన్యం చుక్కల వెలుగులా
పంచేంద్రియాలూ నవరసాలలో
మిళితం చేసుకున్నదీ నిజం

నీవు లేనిదే నేను లేను
నీవు రానిదే నేను రాను
నీవు ఉండనిదే
నేనూ ఉండను
అని పంచభూతాల సాక్షిగా
బంధీకృతమైన శపథం చేసుకున్నదీ నిజం
ఆ నిజం ఎంత నిజమంటే
ఒక ఇజానికి ప్రాణమున్నంత నిజం

ఆ కలయిక దేనికంటే
ఒక ఇజాన్ని నిజం చేసే పూనికకు అని కూడా నిజం
ఒక ఇజంలోని నిజాన్ని
ఒక నిజంలోని ఇజాన్ని కలబోసి స్థాపించేందుకు
అని కూడా నిజం.



## స్థాపితం

ఎప్పుడో శూన్యంలో ఏకాంతమైనపుడు
నువ్వు జ్ఞప్తికి వస్తావు వీచికలా
తడిచి తడిచి పాకుడు పట్టిన
చెక్కిలి జారుడు బండపై
నిలవని చుక్క జారి
గుండెను తడుపుతుంది చల్లగా
తడిచిన గుండె అరవిచ్చి
హాయిగా నవ్వుతుంది నీ జ్ఞాపకంలా


నీ కోసం పాలుబికిన గుండెలు
బాధ ఉబుకుతాయేమొ బరువెక్కుతాయి
నీకు జోల పాడిన గొంతుక
ఏవద్ధం పడుతుందో బిగబడుతుంది.
నీవెంట పరుగెట్టిన అడుగులు
నీకోసం వెళ్దామని తొందరపెడతాయి
కీళ్ళు పట్టేసిన కాళ్ళు కిందపడదోస్తాయి
నాలోంచి పుట్టిన నిన్ను కౌగిలించుకుని
నాలో కలిపేసుకోవాలనిపిస్తుంది.
అసాధ్యమైన ఆలోచనలు
వెక్కిరించి నవ్వుతాయి.

నీకూ నాకూ పేగుబంధం కోసేసిన
జన్మ మొండి కొడవలి
రక్తపు చారల పచ్చి ప్రేమ ఆరనివ్వదు!
రసికట్టిన పుండును మాననివ్వదు.
ఏ చారలూ పడనివ్వకుండా
మనసులు నరికిన జీవితపు కత్తి అసలు కనబడదు.
మృత్యువు అడుగుల సవ్వడి
నన్ను దరిచేరుతున్నప్పుడల్లా
నిన్ను చిచ్చుకొట్టే ధ్వనించిన
వణుకుతున్న దోసిలిలో
ఆయుష్షు భిక్షమడుగుతూనే వుంటా.

నన్ను మించి ఎదిగిన
నా కణాన్ని నన్నొక్కసారి చూసుకోనిమ్మని
వంగిపోయిన నేను, నిలబెట్టిన
వెన్నెముకనొకసారి నిమరాలని
వందిపోయిన నేను, తొడిగిన
చిగురునొకసారి తడమాలని
మసక కమ్మిన కళ్ళు మసిబారుతుంటే
ఆశనైన నేను నిన్ను ఆవరించి ఉందామని.

మంకుపట్టిన మృత్యువుతో బేరమాడి రాజీకొస్తా
నా ఆయుష్షు పంచి నీకు పోస్తే
నేనిప్పుడయినా సరే తనతో వస్తానని
ఒప్పుకుని పాశమై నన్ను తీసుకెళ్తుంటే
పరవశమై నడిచిపోతా గర్వంగా.

నాలోకి నిన్ను పొదువుకోలేని నేను
నీలోకి ఒదిగిపోతూ
నన్ను నీలోంచి వెలికి తీయడం జరగబోదని
నన్ను నేను నిన్నుగా స్థాపితం చేసుకున్నానని
నీలోని నేను తరాలుగా కొనసాగుతూనే ఉంటానని!



## జిజ్ఞాస

మథన మథన
గుండెలో కవ్వం చిలికినట్టు
మెదడును కుమ్మరి పురుగు తొలుస్తున్నట్టు
తలమీద బండిచక్రం తిరుగుతున్నట్టు
వెళ్ళేది ముందుకో వెనక్కో
తెలియని నడక!
కాళ్ళకు గుదిబండలు కట్టినా
ఈడ్చుకుపోతున్న సిద్ధాంతాల వెనుక
అడుగులు మోస్తూ ఘర్షణ
స్వేచ్ఛకై నడిచిన పాదాలన్నీ

వేసిన దారుల్లో
ముందు తరాన్ని నడిపించాలనే
తపనల రెపరెప!
కానీ నిరంతరం మధన మధన
ఎన్నాళ్ళిలా ఎన్నేళ్ళిలా
వేషం మారినా
భాష మార్చినా
ఎదుర్కొనే సమస్యలు
మారుతున్నాయి!
కానీ! మానడం లేదే
ఎటువైపు ప్రయాణం
ఏది గమ్యం
ఎక్కడికక్కడే
ఇదే చివరి మజిలీ అనుకుంటే
ఇక్కడ ఆగొద్దని
నూగు ముళ్ళ బయళ్ళు
తరిమి కొడుతున్నాయి!
వెళ్ళివెళ్ళీ
తూరుపు తొలి సూర్యుణ్ణో
పడమర మలిచంద్రుణ్ణో
కలిపి చూస్తే కానీ
నేలంతా నడిచి చూస్తే కానీ
ఎక్కడాగాలో తెలియదేమో!
అప్పుడు కూడా ఆకాశం ఆహ్వానిస్తుందేమో!

# నాణేనికి మరోవైపు

కట్టు కట్టు
శరీరానికి దడికట్టు
పరిధులతో చుట్టు ముట్టి
దానికి ప్రేమని పేరు పెట్టు

చుట్టు చుట్టు
మనసుకు మడిచుట్టి
అంటరాని దాన్ని చేసి
సంప్రదాయం పేరు పెట్టు

పట్టు పట్టు
పెళ్ళి వేలంలో అమ్ముడుపోయి
తల వంచి తాళికట్టి
మనసునూ శరీరాన్ని
పిడికిట బిగబట్టు
దానిని సమసారమని మభ్యపెట్టు

కొట్టు కొట్టు
ధర్మ శాస్త్రాలు బట్టీ కొట్టు
నస్త్రీ స్వాతంత్ర్యమర్హతి అని
పాతివ్రత్యం పేరు పెట్టి
పుణ్యాలోకాలను వర్ణించి చూపెట్టు

కట్టు కట్టు
ఇంటి పేరు మార్చి
వంటి పేరు మరపించి
అంట్లగిన్నెల మురికి బట్టల
వంటింటి రాజ్యంలో
చీపురు కట్ట చేతికిచ్చి పట్టం కట్టు
జీవితాన్ని కట్టుగొయ్యకు ముడికట్టు

గుట్టు గుట్టు
సంసారం గుట్టుమట్టని
అయిష్టాన్నీ ఆవేదననూ
మౌనంలో పూడ్చిపెట్టు
ఉత్తమ యిల్లాలని దండోరా కొట్టు

తట్టు తట్టు
నీ మనసుని నిద్రలోంచి తట్టు
నాణానికి మరోవైపు నవ్వుకుంటోందని
నీ పగ్గాలతో నిన్నే కట్టేసిందని
చెప్పి మరీ లేవగొట్టు.

# పనిపిల్ల

అమ్మాయిగారు అమ్మను
వాటేసుకుంటుంటే
ఖాళీ చేతులను
గుండెలకు పొదువుకుని
అమ్మాయిగారి చిరిగిన డ్రస్‌లో
పదేపదే అద్దంలో చూసుకునేది!

అమ్మాయిగారి పుస్తకాలు మోస్తూ
స్కూలు వరకు వెళ్ళి
ఎన్ని చదివేస్తున్నారో అనుకుని
తన చేతిలో ఇమడని పెన్సిలుతో
పిచ్చి బొమ్మలు గీసి
జాకెట్లో దాచుకునేది!

స్టోర్ రూమ్‌లో బియ్యం బస్తాల పక్కన
నూకల మూటలా ముడుచుకునేది


బిగువైన జాకెట్ చూసి
పచారీ అంగడివాడు
పరాచికాలాడితే
ఓణీ కావాలని అడగలేక

గుండెలకు ఏదో ఒకటి
అడ్డం పెట్టుకుని తిరిగేది!

అమ్మాయిగారి ప్రేమలేఖ
పక్కింటి అబ్బాయికిచ్చినందుకు
వళ్ళంతా బెల్టు దెబ్బలు తినేది!

తిట్టినా కొట్టినా చీదరించినా
''వస్తున్నానమ్మా'' అని పిలిచినప్పుడల్లా
వెంట వెంట తిరిగి
ఎంగిలి సామాన్లు కడిగి
ఎంగిలి తిండి తిని
బ్రతుకును కూడా ఎంగిలి కాకుండా
కాపాడుకోలేనిది

ఏదో ఒక ఉదయాన
తూర్పు సూరీడు పడమర
తలుపులు తెరిచినట్టు
అబ్బాయి గారితో కలిసి
పూలదండల్లో మంగళసూత్రంతో
గుమ్మంలో నిలబడితే...?!



# చిత్రం

చిత్రం భలే విచిత్రం
నువ్వు నవ్వుతూ ఉండకపోతే నాకు బాధ
నేను పకపక లాడితే నీకు బాధ

నువ్వు స్థాణువైతే నాకు బాధ
నేను చకచకలాడితే నీకు బాధ
నువ్వు మౌనమైతే నాకు బాధ

నేను గలగల లాడితే నీకు బాధ
నీ భార్యనని చెప్పుకోలేకపోతే నాకు బాధ
నా భర్తవని పరిచయం చేస్తే నీకు బాధ

మనిద్దరం మానవజాతే
భావాలెందుకిలా తూర్పు పడమరకు సాగాయో!

నీ మనిషిగా నా హృదయం అడ్డంకులు నెడుతుంది
నా మనిషిగా నీకు అహాలు అడ్డొస్తుంటాయి

నేను నిన్ను ఉదయం వైపు హృదయం వైపు
కాంతివైపు, శాంతివైపు పెరుగుదల వైపు
పెరుగుతూ పొమ్మని పంపిస్తా!
నువ్వు నన్ను అస్తమయం వైపు అణచుబాటు వైపు
అవమానం వైపు చీకటి కూకటి వేళ్ళవైపు శాసిస్తావు


నా ఊహలు నీ నిర్మాణం వైపు
నీ ఊసులు నా నిర్యాణం వైపు
అర్థవంతం నేను అనర్థం నీవు
ఏమిటీ నీకూ నాకూ అంత తేడా?

# నీకే నీకే

హోళీ నివాళులు నీకే నీకే
ఇంద్రధనస్సు రంగరించి
రంగురంగుల పిచికారీ చేస్తా!
అంబరమై సంబరపడతావా?
తడిచి తడిచి రాల్చే
చినుకులు మాత్రం నాకే నాకే!

నీకోసం నేను
నిర్లజ్జనై నిభాసిస్తా
నిర్వేదమై నివాళిస్తా
నిస్వార్థమై నివేదిస్తా
నిర్లోకమై నిరంతరిస్తా
నిశ్వాసమై నిర్ఘోషిస్తా
నిర్వికారమై నిరాకృతిస్తా

నాకోసం నువ్వు
రోజుకు ఒకే ఒక్కసారి
స్పందించి పులకరిస్తేనే
క్షణానికి ఒకే ఒక్కసారి
దరహాసించి జీవిస్తేనే!



# అమ్మ కొమ్మ

ఒడిలో ఒదిగి
కడుపులో కాళ్ళతో కుమ్ముతూ
రుధిరం తాగుతూ మధురంగా
మెడలోని దండలు తెంపుతూ
ఆడుకుంటుంటాడు పసివాడు!

జీవితంలో పొదివి
మనసును కుళ్ళుతో గుచ్చుతూ
జీవనం గ్రోలుతూ తమకంగా
మౌనంలోని గుండెలను తుంచుతూ
ఆనందపడుతుంటాడు మగవాడు

మొదటిసారి చేతులు కట్టిపట్టి
అల్లరి మాన్పుతుంది మమతతో అమ్మ
రెండవసారి చేష్టలు నెట్టికొట్టి
చిల్లర ఆపుతుంది క్షమతో కొమ్మ.

శ్రీలత

# జ్ఞాపిక

ఉదయపు భానుడిలో నీ జ్ఞాపిక
సిద్ధాంతం ఒకటి ఆవేశంగా ఆరంభమైనట్టు

చురుకు కిరణంలో నీ జ్ఞాపిక
అరాచకాన్ని గుచ్చి చంపుతున్నట్టు

మధ్యాహ్న మండలంలో నీ జ్ఞాపిక
వెలుగొకటి ప్రకాశితమవుతున్నట్టు

సాయంత్రపు కాంతిక్షీణతలో నీ జ్ఞాపిక
సంకెళ్ళతో అజ్ఞాతంగా నీవు ఘర్జిస్తున్నట్టు

చితికిన సూర్యాన్ని చూసిన నీ జ్ఞాపిక
అహంకారం పేల్చేసిన ఆవేశపు తునకలు
పడమర ఒడిలో రక్తం స్రవిస్తున్నట్టు

తూరుపు చీకటిలో తొలి వెలుతురు కదిలితే
మళ్ళీ నీ జ్ఞాపిక
అంతం లేని ఆదర్శాలకు ఊటలుగా
తిరిగి నిన్ను ప్రసవించటానికి ప్రకృతి
పురిటి నొప్పులతో ఆయత్తమవుతున్నది.

# కాల ప్రకృతి గతి

ఎన్నో క్షణాలు యుగాలై
ఇనుప గుండును నునులేత చిగుళ్ళతో
దొర్లించాలని ప్రయాసపడుతున్నట్టు
లోతైన బావిలోని బరువైన
నీటి కడవను బలహీనమైన తాడుతో
ముదుసలి వణుకుతూ తోడుతున్నట్టు
ముదురు తాబేలు ముడుచుకున్న
తోళ్ళు జరుపుతూ కొండమీదకు ఎక్కాలని
ఎంతెక్కినా అంతకంతకూ జారుతూ

అక్షరాలు నేర్చుకుంటున్న వాడు
అనంత గ్రంథ పఠనానికి కూర్చున్నట్టు
అల్లరిపిల్ల జడలోని వెంట్రుకలు
ఒక్కొక్కటీ విడదీసి లెక్క పెడుతున్నట్టు

తూరుపు చుక్కల్లోంచి పడమటి చుక్కల్ని తీసేసి
దక్షిణపు చుక్కల్నీ ఉత్తరం చుక్కల్నీ ప్లస్ చేయాలని
అల్లరి పిల్లాడు ఆరాటపడుతున్నట్టు
అసాధ్యంగా బరువుగా కదలనని మొండికేస్తూ
మొండి కత్తితో గుండె కోస్తూ

కొన్ని క్షణాలు
అప్పుడే పూసి హడావిడిగా
రాలిపోతున్న పారిజాతాల్లా
తామరాకు మీదకు చిందిన
తుంపర చినుకు చిలుకులా
చిన్న పిల్లాడేసిన గిరగిర బొంగరంలా

చమక్కున మెరిసి మాయమయ్యే
కారు మబ్బుల్లోని మెరుపుల్లా
రంగులు లెక్క బెట్టే లోపే
కనిపించకుండా పోయే ఇంద్రధనస్సులా
దోసిట్లోని పాదరసగుళికలా
గబగబా గడబిడగా
ఆగకుండా నిలవకుండా

అదే కాలం అవే క్షణాలు
అదే గడియారం అదే లోలకం
తేడా ఒక్కటేనేమో మరి
మానవుడు దూరం చేసుకున్న కాల ప్రకృతి గతి
ప్రకృతి తోడైన పురుషత్వపు అకాల నిరాకృతి.

# ఏం చేస్తావు పాపం!

అగాధాన్ని నేనయినపుడు
తుళ్ళి తుళ్ళి దూకకేం చేస్తావు
జలపాతమంటి నీవు!

హరితగిరిని నేనయినపుడు
మళ్ళీ మళ్ళీ కురియకేం చేస్తావు
మేఘుడంటి నీవు!

ధరణి నేనయినపుడు
తిరిగి తిరిగి ప్రదక్షిణం చేయకేం చేస్తావు
చంద్రమంటి నీవు!

సూర్యకిరణం నేనయినపుడు
తిరిగి జాలువారకేం చేస్తావు
హిమాద్రివంటి నీవు!

విశ్రాంతి ఒడి నేనయినపుడు
అలసి అలసి అలమటించకేం చేస్తావు
అశాంతి నిలయమైన నీవు!

జీవన సర్వస్వం నేనయినపుడు
సర్వం ధారపోయకేం చేస్తావు
అల్ప సంతోషివయిన నీవు!

చాలింక రెప్పల వాల్పులు
తెల్లారనీ నీ బ్రతుకు తూరుపును
నన్ను ఉదయించుకోనీ నీ మనసులో వేకువగా!

# ఏం చెప్పను?

ఎలాగున్నావు నువ్వంటే
ఏం చెప్పను నా నేస్తం
మర మనుషుల మధ్య నన్ను
ఒంటరిగా వదిలేసి
మనసు మాత్రం పట్టుకుని
మరో లోకం చేరిపోయావు

ఎక్కడున్నావు నువ్వంటే
ఏం చెప్పను నా నేస్తం
నన్ను విడిచి నువ్వెళ్ళగానే
నాకు నేను పోగొట్టుకుని
జనారణ్యంలో గడ్డిపోచనై తప్పిపోయానని

ఎపుడు కనిపిస్తావంటే
ఏం చెప్పను నా నేస్తం
జీవించిన క్షణాలంటూ ఉంటే
నీతో గడిపినవేనని
కనిపించడానికి నేనంటూ
ఇంక లేనే లేనని.

# దర్జా దోపిడీ

కన్యాదానం కరిష్యామీ అంటూ
నాన్న పై పంచెకు చేతులు తుడుచుకుంటే
అమ్మ పైట చెంగుతో కళ్ళద్దుకుంటుంది
అందరూ శవమై తరలి పోతున్నట్టు
భావ రహితంగా మౌనమౌతారు
అదేమిటో బందిపోటులొస్తే భయపడతారు
వీళ్ళొస్తే బ్యాండు మేళాలతో మర్యాద చేస్తారు
ఇల్లు లూటీ చేసి
నాన్నను బికారిని చేసినా
మళ్ళీ తిరుగు మర్యాదలు చేసి
బిడ్డను బానిసగా కానుకిచ్చి పంపుతారు.

అడుగు సాగదు మనసుపోదు
తిరిగి చూస్తూ రెండు కళ్ళయినా
ఉండిపొమ్మంటాయేమోనని!

ఇదేవిటో సంతలో బర్రె కూడా
కొన్న వాడింటికెళుతుంది
భారతంలో ఆడపిల్ల
కొనుక్కున్న వాడింటికెళుతుంది
కొనుక్కున్నందుకేమో
కొంగుతో ఉరివేసి తీరుతుంది.

# మోడు తనం

వనానికి వచ్చిన వసంతం
చెప్పకుండానే హడావిడిగా వెళ్ళిపోయింది.

తొడిగిన లేలేత చిగుళ్ళు
చిమ్మిన పుప్పొడి తగుళ్ళు
పరిచిన రేకుల గుబుళ్ళు
మోసిన సౌరభాల చెడుగుళ్ళు
కిలకిలలు కలకలలు
పండుగలు పరవశాలు పరవళ్ళు
పరవశించి ఉండగానే
అశాశ్వతమైన వసంతం
హడావిడిగా వెళ్ళిపోయింది
ఎండిన గుండెలు వాలినరెప్పలు
బీడులో బాధను చిలకరిస్తాయి.

అయినా ఆశలు మాత్రం మొలకెత్తవు
టీవీ ఛానల్స్ మధ్య ఫ్యాషన్ ఫర్నీచర్ పక్కన
పాత మట్టి కుండలా
చీకు పట్టిన బట్టలా ఛీత్కారంగా
ముసలి అమ్మ తనానికి
వేసంగి మోడుతనంతో జత కలిపింది.

# నిస్సత్తువనైనపుడు...

దోసిట్లోని అమృతం
జారి పోతున్నట్టు
ఒళ్ళోని చందమామ
మాయమవుతున్నట్లు
గుండెకు రంధ్రం పడి
మమకారం కారిపోతున్నట్టు
ప్రాణం కొడిగట్టి
వెలగనని మొండికేస్తున్నట్టు
శూన్యం నిండిపోయి
వెలుతుర్ని మింగేసినట్టు
కన్నీటి చుక్కలు జారి
ఆకాశమంతా అలుముకున్నట్టు
దిక్కులు నిశ్శబ్దంగా
వెక్కి వెక్కి పడుతున్నట్టు
శ్మశానపు నిర్లిప్తత
వలయాలుగా ఆవరిస్తున్నట్టు
ఒక్కటేమిటి
నవనాడులూ కృంగిపోతున్నట్టు
నీవు వెనుదిరిగి ఓడిపోతునపుడు
గెలిపించలేక నేను నిస్సత్తువనైనపుడు
ఇంకా చచ్చిపోని నా జన్మను
మనసు ఛీత్కరిస్తూ
శిలువవ్వమని శపిస్తూంది
తాను పారిజాతమై రాలిపోతోంది.




# నా- నీ సంగమం

జీవితపు సాగరంలో
ఆవేదనలు చించి
కాగితపు పడవలు చేసి తేల్చుకుంటూ
హృదయం యుగాలుగా
అలు చిప్పై తేలీ తేలీ
కుంచించుకు పోతూ కుంగుతున్నపుడు
స్వాతివై చినికి తలుపు తడితే
ఆదమరచిన నేను అపురూపమైన నిన్ను
పొదుపుకుంటూ పొగిలి పొగిలి పడుతుంటే

ఎలా ఉంటుంది నేస్తమా
నాతో నీ సంగమమంటే
చెప్పాలా తూరుపు గుండెలో సూర్యుడిలా
మేఘపు రాపిడిలో మెరుపులా
ప్రపంచానికి తొలికాంతి ప్రసవిస్తామని
అది దిక్కులు దృక్కులు ఋక్కులు
కలిసిన విశ్వసమ్మేళనమని!

ఐనా చెప్పాలా ఎలా ఉంటుంది
నాతో నీ సంగమమంటే
అనుభవేక్య వేద్యం
నరనరం పాడిన రాగం

తూర్పు పడమరలేకమయి
పాలపుంతను వణికించి
సూర్యచంద్రులను ఏకకాలాన
వెలిగించిన విన్యాస ధిక్కారం
ప్రశాంత ప్రకృతికి పులకరింతై
జలదరింతలు తెచ్చిన సమ్మోహనం.



# జీలకర్ర + బెల్లం

అది తలమీదికి రాకముందు
అధరాలు స్ట్రాబెర్రీ మధురాలు
కనురెప్పలు రవివర్మ కుంచె కొసళ్ళు
కంఠం జాలు వారుతున్న తేనెపట్టు
తనువు శృతిలయలు కూర్చిన వీణియ
వయసు మదోన్మాథం రేపే మన్మధచాపం
మనసు చెమ్మగిల్లి ఊటలు సాగే తేటచెలమ
పలుకు చిలుకులు నేర్వని కులుకు
బ్రతుకు కలల ఇంద్ర ధాపవేదిక

అరికాళ్ళు నేలనాననీయని అపురూపాలు
కోరకనే బహుమతులు అర్పితాలు
కోరగానే కొండయినా తేబడటాలు
ఇవతలి ఆనందానికి విస్మయాల అద్భుతాలు

అది తలకెక్కి కూర్చున్నాక
ఎదురు చూపులు ఎదురు నిలుస్తాయి
చంద్రబింబం ఏబ్రాసి మొమమవుతుంది
ఎంత అలంకరించుకున్నా పక్కింటావిడే బావుంటుంది
ఏమేసి వండినా వంట రుచి రాదు
ఏది మాట్లాడినా సొదగామారు
ఆదర్శాలు మౌనంలో పొగచూరు

ఊసులూ బాసలూ కసుర్లు విసుర్లు
కిలకిలల బదులు కీసరబాసర్లు
మూర మల్లెలు కూడా దుబారా ఖర్చులు
జీలకర్ర + బెల్లానికి
అలవోకగా తొడిగే ఉంగరానికి
తలవొంచుకుని చెప్పే ఖుబూల్ ఎంత పవరో
స్విచ్చేసినట్లు ఇట్టే బ్రతుకుని మార్చేస్తుంది
కానీ పాపం ఎన్ని మనసులకు తెలుసు
మగువతో పోరు మరణం ముందు హోరులాటిదని
అనురాగంతో అడుగేయకపోతే
ఆదిపాదే హంసపాదవుతుందని?!

# ఆదారి...!

సిరి సంపదలతో తులతూగుతున్నపుడు
సుఖభోగాలనుభవిస్తున్నపుడు
పదవీ ప్రాముఖ్యాలు పొందుతున్నపుడు
బెల్లం చుట్టూ బోలెడన్ని ఈగలు మూగి
నీకు నువ్వే సాటని మెప్పులలో ముంచుతున్నపుడు
ఆ దారసలు గుర్తుండదు!

సముద్రాన్ని ఈదాలనుకుంటే
ఎత్తికుదేసిన అలలా
పోరాటానికి ముందు నిలిస్తే
పొడిచి విడిచిన పోటులా
ఆరాటపడిన సిద్ధాంతం
ఆర్భాటంగా చేసిన ఖూనీలా
జీవితం ఎదురు తిరిగి నిలిచినపుడు
సర్వస్వం నశించి అస్థిత్వాన్ని ప్రశ్నించినపుడు

తూర్పు పడమరల సాక్షిగా
విజయాల నొదిలేసి అపజయాల ఒత్తిడిలో
ఎడారయిన మెదడు నరాలు
తొలకరి తృటికై అల్లార్చుతూ
నాకు నేను మాత్రమే మిగిలినపుడు

ఆ దారి అప్రయత్నంగానే
అటువైపు వెళుతుంది
ఆ ఇంటి ముందు విద్యుద్దీపం
నాకోసమే వెలిగినట్లనిపిస్తుంది
అలసట కూడిన వేగం
ఊపిరి ఎగబీలుస్తూ
ఆ మూర్తి ముందు ఆపేస్తుంది.

ఆ పెదవులు విచ్చుకుంటాయి
మౌనమైన నా కన్నులు చమరుస్తాయి
ఆప్యాయంగా ఆ బాహువులు ఆహ్వానిస్తాయి
దలైలామాను స్పర్శించిన అనుభూతినిస్తాయి

ఆ భుజాలెంత బలమైనవనీ
నా తలబరువంతా అలవోకగా మోసేస్తాయి
ఆ హృదయమెంత నిగూఢమనీ
నన్నిలా కనిపించకుండా ఇముడ్చుకుంటుంది
ఆ కన్నులెంత స్ఫటికాలనీ
నాలోని సమస్త కల్మషాన్ని తేటగా తేలుస్తాయి!

ఆ కొసవేళ్ళు నా కోసం అమృతాన్ని
ఆకలి నోటికి అందిస్తాయి
ఆ నులి వెచ్చని శరీరాన్ని ఆనుకుని
నేను నిర్భయంగా నిదురిస్తా
అమ్మ గర్భకోశంలా అనిపిస్తుందా చోటు

ఆ కళ్ళు తెల్లవార్లూ మేలుకుని
నా కోసం ప్రపంచకథలు
అరమెలకువలో ఆర్తిగా వినిపిస్తాయి
అనుభవ సారాన్ని విద్యగా
అదేపనిగా నేర్పిస్తాయి

క్షణాలలా గడిచాయో లేదో
విశ్రాంతలా అయిందో లేదో
గాఢ సుషుప్తిలోని నన్ను
తట్టి లేపి సూర్యోదయాన్ని చూపిస్తాయి
నీ ప్రయాణం మొదలెట్టమని
గుమ్మం వైపు చూపుడు వేలు సారిస్తాయి

అదే స్నేహం
ఎంత విశాలమయిందనీ
ఎంత మహోన్నతమయిందనీ
ఎంత అత్యవసరమయిందనీ
మనసుకూ మనసుకూ బంధమంత
జన్మ జన్మకూ సాఫల్యమంత
మరణానికి ముందు కలిగే జ్ఞానోదయమంత
అంబరమంత విశ్వమంత
శాశ్వతమంత సంఘటితమంత
శాంతంత కాంతంత
కరుణంత కర్తవ్యమంత

# అదృశ్య మౌనం


నేను నిన్ను చూడగలను
కానీ మాట్లాడలేని కన్నుల వెన్నెల మూగను!
నువ్వు మాట్లాడగలవు
కానీ చూడలేని
తిమిరం చుట్టిన దీపపు సమ్మోవు!
ఆ చల్లదనానికి ఈ వెచ్చదనానికి
రాయభారమెలా జరుగుతుందని
ప్రపంచం హేళనగా నవ్వుతూనే ఉంటుంది!
దానికేం తెలుసు
ప్రతి భావానికీ, హృదయానికీ
కలిపి సంకెళ్ళు వేయగల శక్తి ఒకటి
ఈ ఇలపై ఉందని!

ఇల మాత్రం మూగది కాదూ!
నా హృదయం విప్పి చెప్పేదెలా
అనుకుందా? లేదే!
అనంతం అంధకారం కాదూ!
నా ప్రకృతి అందాల్ని చూసేదెలా
అనుకుందా? లేదే!
చెప్పకున్నా చూడకున్నా
అదృశ్య మౌనంలో
అవి రెండూ సుధూర వీక్షణాలలో
కలిసిపోయి నిలిచిపోలేదూ?

అంతందాకా పరుగెట్టి చూడాలనుకుంటే
ఏ మరుగట్టు దూరమయిపోవడం లేదూ?
ఆ చివర మనముంటే
ఈ చివర కలిసిపోయి
ఈ చివర మనముంటే
ఆ చివర పెనవేసుకుని
మనల్ని పిచ్చివాళ్ళను చేయడం లేదూ?
సృష్టిలోంచి కొత్త అర్థాలను
అస్పష్టంగా మనకు నేర్పడం లేదూ?

చీకట్లోంచి చుక్కల్ని
మౌనం లోంచి రాగాల్ని
మరపులోంచి జ్ఞాపకాన్ని
జీవితంలోంచి అర్థాన్ని
కన్నులకు కాక మనసుకు దర్శింపచేయడం లేదూ?
కొత్త వింత భావాల్ని రేపడం లేదూ?
అవన్నీ సహజమని ఒప్పించడం లేదూ?
ఒప్పుకోకపోతే ఇరుకు బ్రతుకులో
కూరుకుని ఓడిపోతున్నావని నవ్వడం లేదూ?

జన్మల సారాన్ని వడపోసి
ఉగ్గుపట్టడం లేదూ?
మనం ఇంకా ఉంగా ఉంగా అనకపోతే
సృష్టి మనసు చిన్నబుచ్చుకోదూ?



# అద్దం

అద్దం అద్దం
అదే అద్దం
మనిషికీ మనిషికీ మధ్య
మానవత్వాన్ని చితక్కొట్టి
ఇనుప గోడలు కట్టే అద్దం!

రూపును మార్చేసి
మనసును మసిచేసి
స్థాయి స్థితిగతి మార్చేసి

మనిషిని యంత్రంలా మార్చి
భూమిపై నిజాన్ని మాన్పించి
ఆకాశంలోని చుక్కల్ని
మాత్రమే చూసేలా
కన్నులకు పొరలు కప్పే అద్దం!


బంధుత్వాన్ని ఛీత్కరింపచేసి
కన్న కడుపునే కాదనే మాయలో ముంచి
లేని భేషజాలకు పట్టం కట్టించి
ఆబగా ఆశగా అంగుళం అంగుళం
బాహువుల్లోంచి విడిపించని కౌగిలిలో
పొదువుకునే అద్దం.

కాగితపు రెపరెపలానో
కరెన్సీ బరువులానో
ఎల్లలు గీసిన మట్టి చాపలానో
ఆకాశానికి ఎదిగిన సౌధంలానో
కాంక్రీట్ గోడల మధ్య మూలుగుతూనో
బంధించబడ్డ లాకర్ లానో
కళ్ళు మిరుమిట్లు గొలిపే రవ్వల్లానో
ఎన్నో రూపాల్లో చిత్ర విచిత్రంగా మారుతూ
చంచలియై తిరుగాడుతూ
చిత్త మనో వికారాల్ని పెంచుతూ
భూమినే కాదు నీటికి ఆకాశానికి కూడా

హద్దులు గీసి పంచేస్తూ
తీరని తృష్ణను రగిలించే అద్దం!

అదే అద్దం
మనిషితో చూపు కలపనీయని అద్దం
పెదవిప్పి ప్రేమించనీయని అద్దం
చలించి కన్నీరు స్రవించనీయని అద్దం
క్షణ క్షణం తన చుట్టూ
పడి పడి ప్రదక్షిణాలూ చేయిస్తూ
చల్లగా మెల్లగా మెత్తగా
తనలోకి లాక్కునే
ఊబిలాంటి అద్దం!

తోటివాడి కణాల్ని
భోజనంగా తినిపించి
సాటివాడి కన్నీళ్ళను
గుటక వేయించి
రుధిరంతో స్నానం చేయించి
విలాసంగా ఊయల లూపే అద్దం!
నీ నాకు మధ్య కట్టుకానుకల అద్దం!



# తప్పకోండి... తప్పకోండి!

జరుగు! జరుగు!
ఆ మేధ సముద్రపు లోతుల్లో
ఆశయాల ముత్యపు చిప్పలు
కుప్పలుగా పడి వున్నాయి
వెతికి వెలికి తీయాలి
జగతిని సంస్కార సంపన్నం చేయాలి!

తప్పుకోండి! తప్పుకోండి
ఆ నీలాకాశపు కన్నుల్లో నక్షత్ర కాంతులున్నాయి
తెరలు తీసి వాటిని
ప్రసారం కానివ్వండి!
ప్రపంచాన్ని వెలుగుతో నింపాలి!

అదిరదిరి పోకు!

ఆ పెదాల చక్కెర గనుల్లో

ప్రపంచాన్ని నిర్వచించగల

ప్రగాఢ సిద్ధాంతాలున్నాయి

వాటిని అమలు పరచి

సమైక్య ప్రపంచ నిర్మాణం కానివ్వాలి!

అడ్డం రాకు ఆరిపోతావేమో!

ఆ మెత్తని లోతైన గుండెల్లో

చక్కని చెప్పలేని గమ్యాలున్నాయి.

వెతికి వెతికి వాటి వెంట

ధరణిని నడిపించి తీరాలి!

అపార్థం చేసుకోకండి!

కొంగు బిగించిన కోమలిని

ధరిత్రి కడుపులోని


అగ్నిపర్వతమై

పెట్రేగి పోనివ్వండి

ఆ చైతన్య లావా ప్రవాహానికి

ఎదరు మాత్రం రాకండి!

మాడి మసై పోకండి!



# మీకు తెలుసా?

అనాదిగా ఇలాగే ఉదయాన్నే లేస్తాం
దిన చర్య మొదలెడతాం
ఉత్సాహంగా ఉబలాటంగా ఊరటగా
తమకంగా తపనగా తన్మయత్వంగా
త్వమతంగా త్వత్వరితంగా త్వదీప్యంగా
యుగాలు క్షణాలు చేసేసుకుంటూ
హృదయాన్ని లయగా
సరికొత్త శృతిలో మీటుకుంటూ
హడావిడిగా సందడిగా సవ్వడిగా సకలంగా

ఒక్కోసారి ఊహించలేని
ఉదయించిన సూర్యుణ్ణి తిట్టుకుంటూ
బద్ధకంగా నీరసంగా నీరవంగా
అనాసక్తగా అలసటగా అనారాటంగా

అవిశ్రాంతిగా అశాంతిగా అధోగతిగా
ఇనుప పాదాల్ని యుగానికో అడుగు
బలవంతంగా జరుపుకుంటూ
ఈక్షణం ఇంతటితో ఆగిపోతే
నిశ్శబ్దమౌదామన్నంత నిరాశగా

రెండు ఉదయాల్ని కమ్ముకుంటూ
వెలుతురు తగ్గుతుంది చెలమలా
ఆశ దుప్పటి స్పృహను దాస్తుంది
నలుముకుంటున్న కళ్ళముందు
ఏ ఉదయం నిలుస్తుందో తెలీదు
అయినా ఆశగా నమ్మకంగా లేస్తూనే
శాంతినీ అశాంతినీ మోస్తూనే

అనుకూలం వస్తే క్షణాలు కూర్చుకుంటూ
వ్యతిరేకమయితే యుగాలు పోగొట్టుకుంటూ
ఇలాగే ఇలాగే మరణం చేరేదాకా

ఎంతమందికి తెలుసు
క్షణాలే క్షణికాలు కాదు జీవితాలు కూడా అని
ఎంతమందికి తెలుసు
జీవితమే అశాశ్వతమని జీవించడం శాశ్వతమని
మన జ్ఞాపిక మన తరువాత ఎంతో అపురూపమని!

# ప్రకృతి

గర్భాన్ని ధరిత్రిని చేసి
చిరునవ్వును కాంతి చేసి
ఉచ్ఛ్వాస వాయువులో ఊరటగా
నీ జీవానికి ఊపిరి పోసి
బ్రతుకుని ఒడి చేసి లాలిస్తుండగానే
నీకు మీసాలొచ్చేస్తాయి
చిన్ని కాళ్ళతో అంబరాన్ని తన్నినంత
సులువుగా జీవితాన్నీ తన్నుదామని
తమకంతో నాలోని నానీవు
నన్ను వీడి నన్ను మించి ఎదిగిపోదామని
బలమైన పాదముద్రలు
నా శరీరం మీద వత్తుకుంటూ వెళ్ళిపోతావు!
జయాపజయాలవైపు స్థయిర్యంగా ధైర్యంగా
కదిలే నీకు నవ్వుల పువ్వుల
అక్షింతలు వేసి ఆశీర్వదిస్తా దిగ్విజయమని!
మూారెడు వీపు మూర్తివవుతావు
సాధించిన ఘనంలో నువ్వెవరో మరచిపోతావు
జయజయధ్వానాల మధ్య
ఏ స్పందనలూ రవళించవు
అభినందానందాల మధ్య
ఏ కువకువలు కనిపించవు
విజయ పతాకావిష్కరణ శిఖరాగ్రంపై

నిలివాక నిమిత్తమాత్రం నీ ఉనికి!
అక్కడ స్థిరమయేందుకు క్షణాలు కుచించుకుంటాయి
జరుగు జరుగని తరాలు తరుముతాయి
తిరుగు తిరుగని ఆయుష్షు తరుగుతుంది
చాలు చాలని బలం జారుకుంటుంది
విస్ఫులింగాలయిన కళ్ళు చికులిస్తాయి
అరచేతులలో తడుముకుంటూ తడబడతాయి
తెరిచినపుడు మిలమిలలాడిన కళ్ళు
మూసుకుంటున్నప్పుడు నికాంతియై నాలోకి చూస్తాయి.
అదే నవ్వుతో మళ్ళీ నీకు పరిచయమౌతా
తుళ్ళిపడుతూ వెళ్ళి తూలిపడుతూ వచ్చినందుకు
ఓడిపోయిన అలసటతో కాంతి బిక్షనడుగుతావు
జాలిపడిన జోలెలో జోకొడుతూ
విశ్రాంతి తెరకు జోలపాడుతూ
కన్నీళ్ళ లాలపోస్తా!


ప్రక్షాళనమైన నీవు
ప్రకృతి ప్రకంపాలను పరిణామాలను
తెలుసుకుని జ్ఞానోదయమైనా
సృష్టిలయల కోసం అంతరార్థాన్ని
ఇంకెవరికీ చివరివరకూ అర్థం కాకూడదని
నీ అధరాలను మూసి మూగను చేసి
నా ఒడిలోనే నిన్ను నిశ్శబ్దంగా స్థాపితం చేసుకుని
కొత్త జీవాల నిర్మాణంలో నిన్ను మర్చిపోతా!

# అందాక

నేను చూస్తూనే ఉంటావేమో
తడిచిన కనురెప్పల కుంచెలతో
చిగురూహల పంచరంగులతో
విరిసిన మదిలోన
చెరగని నారూపు
చిత్రించు నందాక!

నేను జీవించి ఉంటానేమో
నా మంచు హృదయాన్ని
నిన్నుంచు కోవెలలో
కర్పూర ప్రమిదగా
మలచునందాక!

నే మరణించలేనేమో
మడచిన నీ పెదవులు
తొలినవ్వుల విరయించి
విరిసత్తుల నందించి
వీడ్కోలు నీ కంటూ
వెనుదిరుగునందాక!



# అర్పణ

ఎప్పుడో జాజిమాలల్లుతున్నపుడు
దారం వేలికి ముడివడితేనో
చెట్టు కొమ్మల కింద మైమరచి
కవితలల్లుతున్నపుడు అదాటుగా
సూర్యకిరణం మెడవంపులో తాకితేనో
కూనిరాగం తీస్తూ కురుల ముడులు తీస్తూ
కొత్త భావం తట్టి పల్లవి ఆగిపోతేనో

కుప్పెళ్ళు కొసచేతపట్టి
అరచేతి వేళ్ళలోంచి
ముగ్గు తీగలు జారుతూ ముడివడితేనో
చటుక్కున ముందు నిలుస్తాయి.
అప్పుడెప్పుడో వసంతం వచ్చిన కొత్తలో
కాకూడని అతిథి రాకూడని వేళ వచ్చి
ఇవ్వకూడని ఆతిథ్యం అడక్కుండా పుచ్చేసుకుని
పచ్చి పచ్చి రేగుముల్లులా
శ్వేతనాగు ఉద్రిక్తానికి కాలనాగు కాటులా

నాన్న భుజాన వెనుక నుండి
అమ్మ కొంగుచాటు నుండి
ప్రపంచాన్ని అప్పుడప్పుడే పరిచయం చేస్తున్న
మామయ్య ఆదర్శపు ఆశయంలోంచి
దూసుకొచ్చి లాగిపట్టి తీసుకెళ్ళిన
అవే కళ్ళు అవే చూపులు
అవే తూపులు అవే శరాలు

అయ్యో! పోతోంది ఆపండి అని అరిచినా
ఆగు ఆగు వెళ్ళిపోకని బ్రతిమాలినా
వెనుదిరగకుండా వెళ్ళిపోయిన
మనసు నీడజాడ మళ్ళీ దొరకలేదు.

దొరికినా దొరకకపోయినా గుచ్చివిడిచిన
చురుకు జ్ఞాపకంలోంచి జరగదు

ఆశలనంటుకున్న మంటలు
వాటినేవీ కాల్చలేదు
జారిపోయిన ఆశయాల వెంబడి
అవి కూడా కారిపోనూ లేదు!
శిలువ నెక్కిన ఏసులా
ఆ కళ్ళు గుండెనెక్కాయి
నీ ఆకృతి దర్శనానికి
జన్మంతా అర్పితమని స్రవిస్తూ చెప్పాయి
విడదీద్దామంటే గుండె గాటుపడి
రక్తం స్రవిస్తూ వీలుకాలేదు.

అవి ఎక్కడున్నాయో తెలీదు
వృథా వ్యధల మధ్య నలుగుతున్నాయో
ఏ పచ్చని బ్రతుకులోనో
వెచ్చని వెలుగులు చిమ్ముతున్నాయో
కానీ అవి మాత్రం అవే
అలాగే చూస్తూనే
కళ్ళలోంచి గుండెల్లోకి దూస్తూనే
తొలుస్తూనే మలుస్తూనె
నా కళ్ళ కాంతి ఆరే వరకూ ఆగమంటూ!

# జాడలు దొరకని నీడ

ఆకాశానికి ఎగరేసిన అచ్చంగిల్లా
దోసిలి జారిపడిన ఓటమి
అరచేతిలోని పచ్చీగవ్వలు
గుడ్డిగవ్వ వేసినంత కినుక!

జాజర గొట్టం జారి
రంగులు ఒలికిన అలికిడి
కోలాహలపు కోలాటం కేళిలో
లయ తప్పిన తన్మయం
తొక్కుడు బిళ్ళ గడిమీదపడి
తుమ్మా తుమ్మా అన్నా ఒప్పుకోదు
చేంతాడు ఆటలో మునికాళ్ళను
పడి పడేసిన నవ్వీన సవ్వడి!

పోయిందింకా తిరిగి రానేలేదు
రానంత మాత్రాన ఏదీ ఆగిపోలేదు
లేస్తూనే తింటూనే బ్రతుకుతూనే

తెలీదు తెలీదు స్పందనలెందుకుంటాయో గుండెకు
తెలీదు తెలీదు ఆటలెందుకు ఆడతాయొ ఊహలు
ఎన్ని ఎదలు నీడలు లేక మౌనమయ్యాయొ
ఎన్ని భావాలు సాక్ష్యాలు లేక కనుమరుగయ్యాయొ

కళ్ళు తప్ప జాడలు దొరకని నీడలవి
కనురెప్పలున్నంత వరకూ కళ్ళు దొరకవు
కళ్ళు దొరకనంత వరకూ నీడలూ దొరకవు.

అప్పుడప్పుడూ అందులోనూ
మరుక్కుమన్నప్పుడు
పోయిందీ తీసుకుపోయిందీ గుర్తొచ్చినా
కష్టనష్టాలేవీ జరగవు
దినచర్యలో ఏదీ ఆగదు
మానవ గోళంలో పరిచయమున్నట్లు
కొన్ని చూపులు పలకరించినా
వాలిన కనురెప్పల ఆనవాలు
మడిచిన పెదవులు అవకాశమూ ఇవ్వలేదు!

కనురెప్ప హద్దులు దాటిపోయి
మనసు మూలల్లో ఒదిగిపోతూ
ఎక్కడ తప్పిపోయావు నేస్తం
నిలువునా దోచుకెళ్ళావు సమస్తం!

కనిపించడం లేదు వెతికిపెట్టండని
దిక్కుల్ని బ్రతిమాలినా
చుక్కల్ని వేగుపంపినా
ఆచూకీ తెలీనీక
జన సముద్రంలో బిందువై
ఎక్కడ కొట్టుకుపోయావు నేస్తం!

ఎంత దూరమని పంపను ఎదను
ఏ దిగంతాలలో శోధించమనను
ఏ ధరిత్రి రేణువుల్లో జల్లెడ పట్టమనను
ఆకాశం నీలంలో వెర్రిగా వెతకమనను
పరమకున్న వాయువులో
నీ ఊపిరి పట్టుకోమనను
పొంగుతున్న జలపాతంలో
బిందువులను అడగమనను
ఏ రగులుతున్న అగ్గిలోని
కణికలను బ్రతిమాల మనను
ఎక్కడున్నా ఏవయినా
కనుపాపలలో ముద్రించుకున్న
చెదరని నీ రూపు చాలులే
ఒకే ఆకాశం కింద
ఒకే భూమండలం మీద
అదే వాయువు పీలుస్తూ
అదే నీటిని సేవిస్తూ
నీవున్నంత వరకూ
నేనూ వుంటానని
చేసుకున్న శపథం చాలులే
ఈ జీవం కొస వరకు.



# బలిపీఠం

చెట్టునడిగి పువ్వు పూసేనా?
కొమ్మనడిగి కోయిల పాడేనా?
మేఘాల నడిగి మెరుపు పుట్టేనా?
రక్షకుణ్ణడిగి ప్రేమ తట్టేనా?

అకృతి లేని మనసుకు
ముసుగువేయ సాధ్యమా?
ఇష్టం వచ్చినట్లు మలచడానికి
జీవితం కుమ్మరి చేతి మట్టి ముద్దనా?
బలవంతంగా రేకులు విప్పినా
పువ్వు సౌరభం వెదజల్లునా?

శరీరానికి కల్యాణం జరుగుతుంటే
ప్రేమకు కుదువ పెట్టిన హృదయం
కుళ్ళి కుళ్ళి ఏడ్వదా?
పెద్దతరం అత్తరు మీసాల వెనుక
ముసి ముసి నవ్వుల వత్తిడిలో
మది రైలు కింద నాణెంలా
సహజత్వం కోల్పోదా?

ప్రపంచపు పడతి
ఒక కంట వజ్రకాంతులు చిమ్ముతుంటే
మరో కంటికి కమ్ము
చీకట్లను ఉఫ్‌మని ఊదేసి
రక్షణ పేరుతో గుండెల్ని భక్షణ చేసి
తలపై మేకులు కొట్టాలని చూసే
మూర్ఖత్వపు పెత్తనాన్ని గేలిచేసి
హక్కుల్ని పోగొట్టుకుంటున్న ఆడది
హూంకారం చేస్తూ భీకరాకృతితో
నీకో న్యాయం నాకో న్యాయమా?
మానవ జాతిలోనే మనుగడలో తేడానా?
మానవ విలువల్ని మంటగలుపుతున్నారెందుకు?


మగ వ్యూహాలకు బలి అయ్యే
మూగ రోజులివి కాదని

కాలికింద నొక్కాలని చూస్తే
కొండి విప్పి కుట్టి తీరాలని
తెలియని మానవి.

మౌనమైన మందాకిని వలె
చీకటి పారే చిరుకాల్వ వలె
జింక పిల్లకు బోను క్షేమమని
మేకపిల్లకు అలంకరిస్తే అందమని
రామచిలుకకు పంజరం పవిత్రమని
అందమైన చేపకు అక్వేరియం అవసరమని
బలిపీఠంపై తలపెట్టి మగతగా
భవిష్యత్తుకై కలలు కంటూంది

రాబోయే అబద్ధపు సుఖాలను
అందంగా నెమరేసుకుంటూంది
తానొక అమీనానో జమీలానో
అని అలసట పడి ఆదమరుస్తూంది.

(ఖురాను ప్రకారం రజస్వల అయిన బాలికకు తన ఇష్టం వచ్చిన వ్యక్తిని పెళ్ళాడే హక్కు వుంది. కానీ 1996, సెప్టెంబర్ 25న లాహోరు హైకోర్టు జస్టిస్ అబ్దుల్ హఫీజ్ బీమా 'గార్డియన్ అనుమతి లేకుండా ముస్లిం యువతి ప్రేమించరాదు పెళ్ళాడరాదు' అని తీర్పు ఇచ్చినందుకు నిరసనగా...)



# నీకేం?

నీకేం నీకేం
వంశోద్ధారకుడవని
పుట్టగానే హర్షాతిరేకాలున్నాయి

నీకేం నీకేం
బలంగా ఎదిగి
కండలు తిరిగే శరీరం ఇచ్చిన
ప్రకృతి వరాలున్నాయి

నీకేం నీకేం
సంఘంలో ఏ మూలకయినా
వేళ లేకుండా వెళ్ళగల దారులు
ముందుగానే వేసి వున్నాయి!


నీకేం నీకేం
ఆస్తులు వారసులు
హక్కులు అధికారాలు
ఒదిగి ఒదిగి నిలబడతాయి!

నీకేం నీకేం
ఏదయినా చిటికెలో
సాధించగల అవకాశాలు
అందుబాటులో ఎదురుచూస్తుంటాయి

ఇవన్నీ లేని నాకేం నాకేం!
నిన్ను అమాంతం పిడికిట్లో పట్టి
కొంగు చివర చుట్టి
రాటు దేలి రాజ్యాలేలే
జాణతనం మాత్రం ఉంది.

# శ్రీలత రచనలు

1. వెన్నెల స్పర్శ
(స్వాతి సపరివారపత్రిక నవనవలిక పోటీలలో బహుమతి పొందిన సంచలన నవల)
2. ధిక్కారం (కవితా సంపుటి)
3. రెల్లుపూల జల్లు (కథా గుచ్ఛం)
4. శ్రీలత శతకం





స్త్రీ శక్తి పారమ్యం శ్రీలత నిర్దేశించుకున్న చరమ గమ్యం. శ్రీలతలో నిశిత భావుకత ఉంది. అభివ్యక్తి గాఢత వుంది. ఈ రెండూ ఉన్నప్పుడు పదునైన కవితలు వెలువడక ఏం చేస్తాయి?

- డా. సి. నారాయణరెడ్డి

శ్రీలత భావాలన్నీ ప్రాక్తన నూతనంగా వున్నాయి. ఇవి లలిత లలితాలు, కవితాత్మకాలు, భావుకతా భరితాలు. కొండొకచో తాత్విక స్పర్శావిలసితాలు. సున్నితమైన భావాలు, మృదువైన శైలి, హత్తుకుపోయే వ్యక్తీకరణ శ్రీలత సొత్తు.

- ప్రొ. ఎన్. గోపి